క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్

28-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక: 249

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

డీలిమిటేషన్ బిల్లుపై తమ వైఖరిని పునఃసమీక్షించుకోనున్న డీఎంకే

పాత బిల్లును వ్యతిరేకించాం, కొత్త బిల్లును బట్టి నిర్ణయం తీసుకుంటామని వెల్లడి

రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకపోతేనే మద్దతు ఇస్తామని స్పష్టీకరణ

తమ సూచనలు పరిగణనలోకి తీసుకుంటే బిల్లును అంగీకరిస్తామన్న డీఎంకే

- మిగతా 2వ పేజీలో



రాజకీయ కాకలో 'బావర్చి'!

రెండేళ్ల కిందట బిర్యానీ తింటూ రాహుల్ గాంధీ ప్రకటన

రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ హామీ

దానిని గుర్తు చేస్తూ గులాబీ పార్టీ ఆందోళన

తిప్పికొట్టిన కాంగ్రెస్

- మిగతా 3వ పేజీలో





మరోసారి 'డీ' లిమిటేషన్!

రాజ్యాంగ సవరణకు ముహూర్తం ఖరారు

30 నుంచి నాలుగు రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలు

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: మరోసారి నియోజకవర్గాల పునర్విభజన బిల్లు తెరపైకి వచ్చింది. సరిగ్గా ఏడు నెలల కిందట పార్లమెంటులో ప్రతిపక్షాల ఐక్యత ముందు ఈ బిల్లు ఓటమిపాలైంది. అయినా సరే కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రతిష్టాత్మకంగా తీసుకుని బిల్లును తేనుంది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రత్యేక ప్రకటన చేశారు. నవంబరు 30న లోక్‌సభ, డిసెంబర్ 2న రాజ్యసభ తిరిగి

- మిగతా 2వ పేజీలో

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఖాయం..

కాంగ్రెస్ ఆపలేదు: అమిత్ షా

మహిళా కోటాను కాంగ్రెస్, రాహుల్ ఆపలేరని వ్యాఖ్య

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి అమలు ఖాయమన్న షా

నవంబరు 30 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే గౌరవించినట్లు కాదని రాహుల్‌పై విమర్శలు

18 నెలల ఎమర్జెన్సీతో రాజ్యాంగాన్ని బంధించింది కాంగ్రెస్సేనని ధ్వజం

పునర్విభజనకు గ్రీన్‌సిగ్నల్

డీలిమిటేషన్ బిల్లులో సవరణలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల పరిష్కారానికి పెద్దపీట

అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు 50 శాతం ఏకరీతిన పెంపు

రాష్ట్రాల మధ్య సీట్ల వాటా నిష్పత్తి 2051 వరకు యథాతథం

2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన

లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుంచి గరిష్టంగా 850కి పెంపు

మహిళా రిజర్వేషన్ల అమలు డీలిమిటేషన్‌తో అనుసంధానం

న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో ముఖ్యమైన మలుపుగా భావిస్తున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) అంశంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలను ఏకరీతిగా 50 శాతం పెంచే ప్రతిపాదనతో కూడిన డీలిమిటేషన్ బిల్లులో సవరణలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేబినెట్ శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీలోని సేవాతీర్థ్ లో సమావేశమైంది. పునర్విభజన బిల్లుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రతిపాదిత సవరణల ప్రకారం.. పెరిగిన సీట్ల సంఖ్యను 2051 వరకు, అంటే మరో 25 ఏళ్లపాటు యథాతథంగా కొనసాగించేలా ఫ్రీజింగ్ అమల్లో ఉంటుంది.

- మిగతా 2వ పేజీలో



మియాపూర్ భూములపై 23 ఏళ్లే వివాదానికి

సుప్రీంకోర్టు తీర్పుతో తెర



కోకాపేట తరహాలో భారీ లేఅవుట్ అభివృద్ధికి హెచ్ఎండీఏ ప్రణాళిక

సుమారు 400 ఎకరాల్లో ప్లాట్లు ఏర్పాటు చేసి ఈ-వేలం వేయాలని నిర్ణయం

ఈ భూముల అమ్మకం ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం అంచనా

లేఅవుట్ అభివృద్ధి కోసం రూ. 700 కోట్ల వరకు వ్యయం చేయనున్న ప్రభుత్వం

కోకాపేట, బుద్వేల్ భూముల వేలంతో ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకున్న తెలంగాణ ప్రభుత్వం.. ఇప్పుడు అదే బాటలో మరో భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన మియాపూర్ ప్రాంతంలోని విలువైన ప్రభుత్వ

- మిగతా 2వ పేజీలో



కూకట్ పల్లి ట్రక్ పార్క్ వేలానికి

హైకోర్టు గ్రీన్ సిగ్నల్

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ట్రక్ పార్క్ భూముల వేలంపై దాఖలైన పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

పిటిషన్లలో ప్రజా ప్రయోజనం లేదన్న కోర్టు

- మిగతా 3వ పేజీలో

ఫిలిం మేకర్స్‌కు

ఊరట!

ఇష్టారాజ్యంగా సినిమాలకు అడ్డుపడితే కుదరదు

మనోభావాల పేరుతో కొందరు న్యాయ పోరాటం

తాజాగా రామాయణం పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



క్రైమ్ మిర్రర్, సినిమా డెస్క్: సినిమాలతో పాటు సినిమా కథలపై అభ్యంతరాలు, వివాదాలు నడవడం సర్వసాధారణంగా

సంక్షోభంలో విజయ్ సర్కార్!

కొలువుదీరిన ఆరు నెలలకే సమస్యలు

కట్టు దాటుతున్న ఎమ్మెల్యేల క్రమశిక్షణ

వెంటాడుతున్న మతపరమైన వివాదాలు..

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: తమిళనాడులో మార్పు నినాదంతో అధికారంలోకి వచ్చారు టీవీ కే విజయ్. అనూహ్యంగా అక్కడి ప్రజలు అవకాశం ఇచ్చారు. అయితే అధికారం చేపట్టిన ఆరునెలలకే ఊహించని రాజకీయ, పాలనాపరమైన సంక్షోభాల సుడిగుండంలో చిక్కుకున్నారు విజయ్. సినీ గ్లామర్ తో పాటు భారీ ప్రజాకర్షణతో గద్దెనెక్కారు. కానీ క్షేత్రస్థాయి పాలనలో ఎదురవుతున్న సవాళ్లు ఆయనకు



- మిగతా 3వ పేజీలో



భారత విద్యార్థులకు యూకే షాక్..

స్టూడెంట్ వీసాల్లో భారీ కోత

యూకేలో భారత విద్యార్థుల వీసాల్లో 29 శాతం తగ్గుదల నమోదు

చైనా తర్వాత రెండో అతిపెద్ద దేశంగా కొనసాగుతున్న భారత్

వీసా తిరస్కరణల రేటు రెట్టింపై 6.4 శాతానికి చేరిక

యూనివర్సిటీల స్పాన్సర్‌షిప్‌పై యూకే ప్రభుత్వం కఠిన నిబంధనలు

మాస్టర్స్ డిగ్రీ విద్యార్థుల వీసాలపై తగ్గుదల ప్రభావం అధికం

- మిగతా 2వ పేజీలో



మరోసారి 'ఢీ' లిమిటేషన్!

సమావేశం కానున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం రోజున ఈ ప్రత్యేక సమావేశాల ప్రకటన రావడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. 2029 సార్వత్రిక ఎన్నికలను కొత్త నియోజకవర్గాల సరిహద్దులతో నిర్వహించాలంటే ఈ సెషన్ లోనే బిల్లును ఆమోదించడం ప్రభుత్వానికి అత్యంత కీలకంగా మారింది.

అప్పట్లో వెనక్కి..

ఈ ఏడాది ఏప్రిల్ లో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా పార్లమెంట్ లో పెట్టారు. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వెనక్కి తీసుకుంది. అయితే అప్పటి పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు లోక్ సభలో సమీకరణలు గణనీయంగా మారాయి. ఇండియా కూటమి నుంచి డీఎంకే బయటకు వచ్చింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా బిల్లుకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఎన్సిపి శరద్ పవర్ వర్గం ఎంపీ సుప్రియ సూలే సంకేతాలు ఇవ్వడం ప్రభుత్వానికి కలిసి వచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి. వీటికి తోడు శివసేన తిరుగుబాటు ఎంపీలు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి చీలిపోయి ఏర్పడిన ఎన్సిపిఐ వర్గం ఎంపీల మద్దతు కూడగట్టడం ద్వారా కేంద్రం రాజ్యాంగ సవరణకు సరిపోయే సంఖ్యాబలాన్ని సమకూర్చుకుంది.

కాంగ్రెస్ నుంచి అభ్యంతరాలు..

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రతిపక్షాల నుంచి కూడా కొన్ని రకాల అభ్యంతరాలు ఉన్నాయి. లోక్సభ స్పీకర్ ఇంకా అధికారికంగా గుర్తించని.. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద నోటీసులు ఎదుర్కొంటున్న టీఎంసీ తిరుగుబాటు ఎంపీల మద్దతుతో బిల్లును గట్టెక్కించాలని చూడడం పై కాంగ్రెస్ సహా ఇతర పక్షాలు మండిపడుతున్నాయి. అసలు సభలో ప్రవేశపెట్టబోయే బిల్లు కాపీలను ఇంకా ఎంపీలకు పంపిణీ చేయకముందే.. తెర వెనుక అతుకుల బొంత రాజకీయాలు నడుపుతున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

కేంద్రం అటాక్..

కేంద్ర ప్రభుత్వం సైతం కాంగ్రెస్ తీరును తప్పుపడుతోంది. మహిళా రిజర్వేషన్ల అమలును అడ్డుకోవడానికి కాంగ్రెస్ ఈ బిల్లును వ్యతిరేకిస్తోందని విమర్శిస్తోంది. మహిళా కోటా ముసుగులు నియోజకవర్గాల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా తగ్గదని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గతంలో హామీ ఇచ్చినప్పటికీ.. జన గణన పూర్తికాకుండా పునర్విభజన చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు వాదిస్తున్నాయి.

ఆ కారణంతోనే..

ఈ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగుతుండడం విశేషం. నవంబరు 30 నుంచి డిసెంబర్ 3 వరకు నాలుగు రోజులు పాటు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. ఒకవైపు అనర్హత వేటు భయం ఎదుర్కొంటున్న తిరుగుబాటు ఎంపీల ఓట్లు, కొందరు సభ్యుల గైర్హాజరు వంటి అంశాలు కీలకంగా మారుతున్నాయి. మరోవైపు శుక్రవారం జరగనున్న కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ సమావేశంలో విపక్షాలు ఎలాంటి ప్రతి వ్యూహాన్ని రచిస్తాయి అనేది ఆసక్తికరంగా మారింది. రాజ్యాంగ దినోత్సవం నాడు మొదలైన ఈ రాజకీయ చదరంగం పార్లమెంట్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి..

మియాపూర్ భూములపై 23 ఏళ్ల వివాదానికి సుప్రీంకోర్టు తీర్పుతో తెర



భూములను అభివృద్ధి చేసి, విక్రయించడం ద్వారా భారీగా నిధులు సమీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు శేరిలింగంపల్లి మండల పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లలో ఉన్న భూముల్లో మెగా లేఅవుట్ అభివృద్ధి చేసే బాధ్యతను హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)కు అప్పగించింది. దాదాపు 23 సంవత్సరాలుగా ప్రైవేటు వ్యక్తులు, సొసైటీలతో నడిచిన న్యాయపోరాటంలో ఇటీవలే సుప్రీంకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. మొత్తం 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేయడంతో, ఈ భూములను అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమమైంది. తీర్పు అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి భూములను స్వాధీనం చేసుకున్నారు. ముంబై జాతీయ రహదారికి కేవలం అర కిలోమీటరు దూరంలో ఉండటంతో ఈ భూములకు భారీ డిమాండ్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న భూమిలో సుమారు 110 నుంచి 150 ఎకరాల వరకు ఆక్రమణల్లో ఉన్నాయి. ఇక్కడ ఇప్పటికే బస్తీలు, కాలనీలు వెలిశాయి. వీటిని ప్రస్తుతానికి తొలగించే పరిస్థితి లేనందున, దీనిపై ప్రభుత్వ స్థాయిలో విధానపరమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆక్రమణలు పోగా, సుమారు 386 నుంచి 400 ఎకరాల భూమి లేఅవుట్ అభివృద్ధికి అందుబాటులో ఉంది. ఈ భూమిలో విశాలమైన రహదారులు, పార్కులు, గ్రీన్ స్పేస్, ఇతర సామాజిక మౌలిక వసతులు కల్పించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.లేఅవుట్ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ. 600 నుంచి 700 కోట్లు ఖర్చవుతుందని అంచనా. అభివృద్ధి పనులు పూర్తయ్యాక, కోకాపేట నియోపొలిస్ తరహాలోనే ఇక్కడ కూడా ప్లాట్లను ఈ-వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయం లభిస్తుందని, ఆ నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే లేఅవుట్ అభివృద్ధి పనులు ప్రారంభించి, వేలానికి సంబంధించిన ప్రకటన విడుదల చేసేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది.

పునర్విభజనకు గ్రీన్‌సిగ్నల్



మహిళా రిజర్వేషన్ల అమలుతో ముడిపడిన ఈ సవరించిన డీలిమిటేషన్ బిల్లును వచ్చేవారం జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు ప్రత్యేక సమావేశాలు జరుగనున్నాయి. లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్టంగా 850కి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఈ చర్య మార్గం సుగమం చేస్తుందని అధికార పక్షం పేర్కొంది.

దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు పరిష్కారం

ఈ ఏడాది ఏప్రిల్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన రాజ్యాంగ(131వ సవరణ) బిల్లుకు విపక్షాల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. ముఖ్యంగా డీలిమిటేషన్‌ను తదుపరి జనగణనతో ముడిపెట్టడంపై విపక్షాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, తాజా జనాభా గణాంకాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరిగితే ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పెరిగి, దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గే ప్రమాదం ఉందని వాదించాయి. ఈ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. జనగణనతో సంబంధం లేకుండా, అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచే మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రాల మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న సీట్ల వాటా నిష్పత్తిని 2051 వరకు యథాతథంగా కొనసాగించనున్నారు. జనాభా నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాల ప్రాతినిధ్య వాటా తగ్గకుండా ఉండటమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా చెబుతున్నారు. రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిలో మార్పులు చేయకుండా, ప్రతి రాష్ట్రంలో జనాభా మార్పులకు అనుగుణంగా నియోజకవర్గాల హద్దులను పునర్విభజించేందుకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే అంశం ఈ బిల్లులో ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్ ప్రక్రియతో అనుసంధానం చేస్తున్నారు. తదుపరి జనగణన పూర్తయ్యే వరకు వేచి చూడకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా బిల్లులో మార్పులు చేసినట్లు సమాచారం. డీలిమిటేషన్ ఎప్పుడు చేపట్టాలి? ఏ జనాభా లెక్కలను ఉపయోగించాలి? వంటి అంశాలను సాధారణ చట్టం ద్వారా పార్లమెంట్ నిర్ణయించేలా రాజ్యాంగ సవరణ(131వ సవరణ బిల్లు)లో ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిసింది. సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఆయన నామినేట్ చేసిన ఎన్నికల కమిషనర్‌తోపాటు సంబంధిత రాష్ట్ర ఎన్నికల కమిషనర్లను ఇందులో సభ్యులుగా నియమించే అవకాశం ఉంది.

50 శాతం ఫార్ములాతో తెలుగు రాష్ట్రాల వాటా

కేంద్రం ప్రతిపాదించిన 50 శాతం ఏకరీతి పెంపు ప్రతిపాదన అమల్లోకి వస్తే పార్లమెంట్‌లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగనుంది. జనాభా నియంత్రణ కారణంగా సీట్లు తగ్గిపోతాయన్న ఆందోళనకు తెరపడుతుంది.

భారత విద్యార్థులకు యూకే షాక్..



(మొదటి పేజీ తరువాయి)

యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే భారత విద్యార్థులకు దారులు కఠినంగా మారుతున్నాయి. యూకే ప్రభుత్వం వీసా నిబంధనలను కఠినతరం చేయడంతో, భారతీయ విద్యార్థులకు జారీ చేసే స్టూడెంట్ వీసాల సంఖ్యలో భారీ తగ్గుదల నమోదైంది. ఈ నెల 26న యూకే హోం ఆఫీస్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, 2025 సెప్టెంబరు నుంచి 2026 సెప్టెంబర్ వరకు భారతీయ విద్యార్థులకు మంజూరు చేసిన స్టూడెంట్ వీసాలు 29 శాతం తగ్గాయి.గణాంకాల ప్రకారం, ఈ కాలంలో భారతీయ ప్రధాన దరఖాస్తుదారులకు కేవలం 69,855 వీసాలు మాత్రమే జారీ అయ్యాయి. ఇది మొత్తం వీసాలలో 22 శాతం వాటా. అంతర్జాతీయ విద్యార్థులను పంపడంలో చైనా (24 శాతం) మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో నిలిచింది. పాకిస్తాన్ (6 శాతం), నైజీరియా (5 శాతం), అమెరికా (4 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం మీద, యూకే జారీ చేసిన స్పాన్సర్డ్ స్టడీ వీసాల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 23 శాతం క్షీణించి 335,801కి చేరింది.

రెట్టింపైన తిరస్కరణలు.. పెరిగిన ఉపసంహరణలు

వీసాల సంఖ్య తగ్గడమే కాకుండా, వీసా తిరస్కరణలు, అప్లికేషన్ల ఉపసంహరణలు కూడా గణనీయంగా పెరిగాయి. హోం ఆఫీస్ డేటా విశ్లేషణ ప్రకారం, 2025 సెప్టెంబర్-2026 సెప్టెంబర్ మధ్య కాలంలో వీసా తిరస్కరణల రేటు 6.4 శాతానికి చేరింది. ఇది అంతకు ముందు ఏడాది 3.1 శాతంగా ఉండగా, ఇప్పుడు రెట్టింపు కంటే ఎక్కువ కావడం గమనార్హం. 2015 తర్వాత ఇదే అత్యధిక తిరస్కరణల రేటు. అంతేకాకుండా, దరఖాస్తుల ఉపసంహరణలు కూడా ఆందోళనకర స్థాయిలో పెరిగాయి. 2026 జులై నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 3,682 దరఖాస్తులు నిర్ణయం వెలువడక ముందే ఉపసంహరించుకున్నారు. గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య కేవలం 779గా ఉండగా, ఇప్పుడు ఏకంగా 370 శాతం పెరుగుదల కనిపించింది.

మాస్టర్స్ విద్యార్థులపై అధిక ప్రభావం

ఈ తగ్గుదల ప్రభావం ముఖ్యంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ (మాస్టర్స్) కోర్సులు అభ్యసించాలనుకునే విద్యార్థులపై ఎక్కువగా పడింది. ఈ ఏడాది 2026 సెప్టెంబర్ నాటికి మాస్టర్స్ కోర్సుల కోసం 181,920 వీసాలు మాత్రమే జారీ అయ్యాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే 29 శాతం తక్కువ. మొత్తం స్పాన్సర్డ్ వీసాలలో మాస్టర్స్ విద్యార్థుల వాటా కూడా 63 శాతం నుంచి 58 శాతానికి తగ్గింది.

కఠినంగా మారిన యూనివర్సిటీ నిబంధనలు

వీసాల జారీలో ఈ మార్పులకు ప్రధాన కారణం యూనివర్సిటీలపై యూకే ప్రభుత్వం విధించిన కఠినమైన నిబంధనలే. 2026 జూన్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త మార్గదర్శకాల ప్రకారం, యూనివర్సిటీలు కొన్ని కఠినమైన షరతులను పాటించాల్సి ఉంటుంది. విద్యార్థుల వీసా తిరస్కరణల రేటు 5శాతం కంటే తక్కువగా, కోర్సు ఎన్‌రోల్‌మెంట్ రేటు 95శాతం కంటే ఎక్కువగా, కోర్సు పూర్తి చేసే వారి రేటు 85శాతం కంటే ఎక్కువగా ఉండాలి. ఈ నిబంధనల కారణంగా కొన్ని యూనివర్సిటీలు నిర్దిష్ట దేశాల నుంచి విద్యార్థుల స్పాన్సర్‌షిప్‌ను తగ్గించుకుంటున్నాయి.మొత్తం మీద, యూకే ఇప్పటికీ భారత విద్యార్థులకు ఒక ప్రధాన గమ్యస్థానంగా ఉన్నప్పటికీ, వీసా పొందే ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. విద్యార్థులు సరైన యూనివర్సిటీని ఎంచుకోవడంతో పాటు, తమ దరఖాస్తు విశ్వసనీయంగా ఉండేలా చూసుకోవడం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. యూకే అంతర్జాతీయ విద్యా మార్కెట్ ఒక ముఖ్యమైన సర్దుబాటు దశలో ఉందని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

డీలిమిటేషన్ బిల్లుపై తమ వైఖరిని పునఃసమీక్షించుకోనున్న డీఎంకే



కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'నియోజకవర్గాల పునర్విభజన' (డీలిమిటేషన్) బిల్లుపై ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) తన వైఖరిలో మార్పు సంకేతాలు ఇచ్చింది. గతంలో ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన డీఎంకే, ఇప్పుడు కేంద్రం తీసుకురాబోయే సవరించిన బిల్లును పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. తమ ఆందోళనలను, సూచనలను పరిగణనలోకి తీసుకుని కొత్త బిల్లును రూపొందిస్తే, దానికి మద్దతు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేసింది. ఈ పరిణామం జాతీయ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇళంగోవన్ మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో డీలిమిటేషన్ బిల్లు రాష్ట్రాల, ప్రాంతీయ పార్టీల ప్రాతినిధ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న ఆందోళనలతో తాము వ్యతిరేకించామని ఆయన గుర్తుచేశారు. అయితే, ఇప్పుడు కేంద్రం తీసుకురాబోయే కొత్త బిల్లు స్వరూపాన్ని చూడకుండా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేమని తెలిపారు. "పాత డీలిమిటేషన్ బిల్లును మేం వ్యతిరేకించాం. ఒకవేళ కేంద్రం తీసుకురాబోయే కొత్త బిల్లు ఆమోదయోగ్యంగా ఉంటే, మేం కూడా అంగీకరిస్తాం. ముందు బిల్లును రానివ్వండి. వారు బిల్లును ఎలా సవరించారో చూడాలి. దానివల్ల రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందా? లేదా? అనేది పరిశీలించాలి. దీనిపై రాష్ట్ర, ప్రాంతీయ పార్టీలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది" అని ఇళంగోవన్ ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ వివరించారు. కొత్త బిల్లులోని నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాకే తమ పార్టీ తుది వైఖరిని ప్రకటిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రాలు, ప్రాంతీయ పార్టీలు లేవనెత్తిన అంశాలను కేంద్రం ఏ మేరకు పరిగణనలోకి తీసుకుందనే దానిపైనే తమ మద్దతు ఆధారపడి ఉంటుందని ఇళంగోవన్ స్పష్టం చేశారు. "కొత్త డీలిమిటేషన్ బిల్లు ఎలా వస్తుందో చూద్దాం. బిల్లును పూర్తిగా పరిశీలించిన తర్వాతే దానిపై మేం స్పందించగలం. మా అభిప్రాయాలను, సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటే, మేము దానిని అంగీకరించాల్సి ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. డీఎంకే మెత్తబడటంతో ఈ బిల్లుపై జాతీయ స్థాయిలో మరోసారి చర్చ మొదలైంది.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఖాయం..



పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ గానీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గానీ ఏమాత్రం ఆపలేరని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశంలోని మహిళలకు కచ్చితంగా 33 శాతం రిజర్వేషన్లు అందుతాయని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు పూర్తిగా కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ఢిల్లీలో నిర్వహించిన 'సంవిధాన్ గౌరవ్ దివస్' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏప్రిల్‌లో 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి, మహిళా కోటాను వేగవంతం చేసేందుకు తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయని అమిత్ షా మండిపడ్డారు. నవంబరు 30న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ ఆయన ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేవలం రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ప్రదర్శించినంత మాత్రాన రాజ్యాంగాన్ని గౌరవించినట్లు కాదని రాహుల్ గాంధీని ఉద్దేశించి విమర్శించారు. రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధత ప్రవర్తనలో కనిపించాలని, న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం లాంటి వ్యవస్థలను కించపరచడం కాంగ్రెస్‌కే చెల్లిందని దుయ్యబట్టారు. గతంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి 18 నెలల పాటు రాజ్యాంగాన్ని చెరబట్టిన చరిత్ర ఆ పార్టీదేనని ఎద్దేవా చేశారు.బీజేపీ పాలిత రాష్ట్రాలన్నింటిలో త్వరలోనే యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) అమలు చేసి తీరుతామని హోం మంత్రి స్పష్టం చేశారు. రాజ్యాంగ రూపకర్తలు నిర్దేశక సూత్రాల్లోనే ఉమ్మడి పౌరస్మృతిని చేర్చారని గుర్తుచేశారు. మతంతో సంబంధం లేకుండా హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ, పార్సీ పౌరులందరికీ ఒకే చట్టం వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మోదీ పాలనలో ఆర్టికల్ 370 రద్దు, వామపక్ష తీవ్రవాదం అణచివేత, ఈశాన్య రాష్ట్రాల్లో 11 వేల మంది సాయుధుల లొంగుబాటుతో దేశ సమగ్రత బలపడిందని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా 80 కోట్ల మంది పేదలకు లబ్ధి చేకూర్చామని వివరించారు.



సంక్షోభంలో విజయ్ సర్కార్!

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల మధురాంతకం, ధరాపురం రెండు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీవీకే అభ్యర్థులు విజయం సాధించారు. కానీ ఆ గెలుపు అంత సులువుగా రాలేదు. ప్రత్యర్థి డిఎంకె, ఏఐడీఎంకే కూటముల నుంచి గట్టి పోటీ ఎదురై.. అతి కష్టం మీద ఘట్టెక్కాల్సి రావడం అధికార పార్టీకి తొలి హెచ్చరికగా మారింది.

డీఎంకే ఎదురుదాడి..

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ప్రధాన ప్రతిపక్షం ఎదురుదాడి ప్రారంభించింది. ఉదయనిది స్టాలిన్ తో సహా మిగతా విపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యేలు కట్టు తప్పి ప్రవర్తించడం విజయ్ ప్రభుత్వానికి తలవొంపులు తెస్తోంది. ఒక మహిళా కలెక్టర్ ని అధికార పార్టీ ఎమ్మెల్యే వేదించారన్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారాయి. ఈ కేసులో కోర్టు మెట్లు ఎక్కాల్సి కూడా వచ్చింది. ఆ ఎమ్మెల్యేను ప్రభుత్వం వెనుకేసుకొస్తుందన్న విమర్శలు రావడం చూస్తుంటే... కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు అధికారాన్ని ఎంతలా టేక్ ఇట్ గ్రాండ్ గా తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. అదుపుతప్పుతున్న సొంత పార్టీ ప్రజాప్రతినిధులకు కళ్లెం చేయలేక సీఎం మౌనంగా ఉండడం ఆయన ప్రతిష్టను మరింత దెబ్బతీస్తోంది.

తప్పడు సూచనలు..

ఇంకోవైపు సున్నితమైన మతపరమైన, సామాజిక



అంశాల్లో మిత్రపక్షాలు, సలహాదారులు ప్రభుత్వానికి తప్పుదోవ పట్టిస్తున్నారని అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. తాజాగా తిరుప్పరకుండ్రమ్ కార్తీకదీపం వివాదంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ.. సంప్రదాయం పేరుతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెద్ద రాజకీయ వివాదానికి దారి తీసింది. ఇవి వ్యవహారం కోర్టు ధిక్కరణ పిటిషన్ ల వరకు వెళ్లడమే కాకుండా హిందూ సంఘాలు, బిజెపి ఆందోళనలతో విజయ్ రాజకీయంగా గట్టి ఎదురు దెబ్బతిన్నారు. రెండు వైపులా మెప్పించబోయి అసలుకే ఎసరు తెచ్చుకున్నారు. ఈ వివాదం ప్రభుత్వాన్ని పూర్తిగా డ్యామేజ్ చేసింది.

అత్యంత క్లిష్ట సమయం..

రాజకీయంగా అత్యంత క్లిష్ట సమయంలో విజయ్ ఉన్న పరిస్థితుల్లో మరో ఎన్నికలు సమీపిస్తున్నాయి. వివిధ పార్టీల నుంచి గెలిచి టీవీ కే లో చేరిన వారు రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. స్టాలిన్ పై గెలిచిన బాబు అనే ఎమ్మెల్యే చనిపోయారు. అక్కడ కూడా ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. విజయ్ అసెంబ్లీలో తన సొంత బలాన్ని నిరూపించుకోవడానికి ఈ ఐదు స్థానాల ఫలితాలు అత్యంత కీలకంగా మారాయి. కలెక్టర్ వేధింపుల వివాదం, తిరుప్పర కుండ్రం దీపం సెగ, శాంతి భద్రతల వైఫల్యాల నడుమ జరగబోయే ఈ ఉప ఎన్నికలు సీఎం విజయ్ నాయకత్వానికి పెను విషమ పరీక్ష గా మారనున్నాయి. కేవలం సినిమా ఇమేజ్తో ఎక్కువ కాలం ప్రభుత్వాన్ని నడపడం అసాధ్యం.. కట్టు తప్పిన ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవడం, మిత్రపక్షాల ఒత్తిళ్లకు తలకోకుండా స్వతంత్రంగా వ్యవహరించడం.. పాలనపై పట్టు సాధించడం తక్షణం అవసరం. లేదంటే రాబోయే ఐదు ఉప ఎన్నికల్లో ఏమాత్రం తేడా జరిగినా అది ప్రభుత్వ మనుగడకే ముప్పుగా మారనుంది. విజయ్ ఎదుర్కొంటున్న సమస్యలు మరింత జఠిలమయ్య అవకాశం ఉంది.

ఫిలిం మేకర్స్‌కు ఊరట!

(మొదటి పేజీ తరువాయి)

మారింది. ఇప్పుడు తాజాగా నితీష్ తివారి రామాయణ వివాదం పై సుప్రీంకోర్టులో విచారణ నడిచింది. ఇతిహాసాన్ని వక్రీకరించారంటూ దాఖలైన పిటిషన్ పై అత్యవసర విచారణకు ధర్మాసనం నిరాకరించింది. అంతటితో ఆగలేదు న్యాయస్థానం. కీలక వ్యాఖ్యలు చేసింది. వారు తమకు అర్థమైన విధంగా సినిమా తీశారు. నీకు అర్థమైన విధంగా మీరు సినిమా తీయండి. కోర్టు సమయాన్ని వృధా చేయకండి అంటూ పిటిషనర్ తరపు న్యాయవాదికి గట్టిగానే చురకలాంటించింది న్యాయస్థానం. సినిమా చూడాలనుకున్న వారు ఇప్పటికే చూసేసారని వ్యాఖ్యానించింది. సినిమా నచ్చకపోతే మరో సినిమా తీసుకోండి అన్నట్టుగా సుప్రీంకోర్టు వ్యాఖ్యలు సాగడం చర్చనీయాంశంగా మారింది.

మనోభావం పేరుతో..

సినిమా నిర్మాణంలో ఇప్పుడు మనోభావం అని ఒకటి బయటపడుతోంది. దాని చుట్టూ కేసులు అల్లుకుంటున్నాయి. ఫలానా వ్యక్తికి, ఫలానా సమాజానికి సంబంధించి మనోభావం దెబ్బతింది అంటూ కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించడం పరిపాటిగా మారింది.



ఇప్పటివరకు పురాణాలు, ఇతిహాసాల ఆధారంగా సినిమాలు తీయాలంటే ఫిల్మ్ మేకర్స్ లో ఒకటి భయం. ఎవరి మనోభావాలు దెబ్బతింటాయో, ఏ సన్నివేశంపై ఎలాంటి అభ్యంతరం వస్తుందో, సినిమా విడుదలయ్యాక ఎన్ని వివాదాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన ఉంటుంది. ప్రతి ఒక్కరి అభిప్రాయాలను, అంచనాలను సంతృప్తి పరచడం సాధ్యం కాని పని. అలాగని భిన్నమైన దృక్కోణంలో కథను చెప్పే స్వేచ్ఛ లేకపోతే కొత్త ఆలోచనలకు అవకాశం ఉండదు. ఇటువంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు కామెంట్స్.. పురాణాలు, ఇతిహాసాల ఆధారంగా సినిమాలు రూపొందించే దర్శక నిర్మాతలకు కొంత ఊరట ఇచ్చే అంశం. అలాగని సినిమాలపై వచ్చే ప్రతి అభ్యంతరాన్ని కొట్టిపారేసిన తీర్పు ఎంత మాత్రం కాదు. ఈ పిటిషన్ పై అత్యవసర విచారణను మాత్రమే కోర్టు నిరాకరించింది. ఒక కథను ఒక దర్శకుడు తన దృక్కోణంలో చెబితే.. మరో దర్శకుడు మరో కోణంలో చెప్పవచ్చు. ప్రేక్షకులకు నచ్చితే ఆదరిస్తారు. లేకుంటే మాత్రం తిరస్కరిస్తారు.

బాలీవుడ్ లోనే అధికం..

భారత చిత్ర రంగ పరిశ్రమలో బాలీవుడ్ కి ప్రత్యేక స్థానం. ఎందుకంటే వివిధ రాష్ట్రాల్లో హిందీ అనేది భాగమై ఉంది. అయితే భారత చిత్ర పరిశ్రమలో నాణ్యమైన సినిమాలు వస్తున్నప్పుడు.. అదే సమయంలో సెన్సార్ కు సంబంధించి కొన్ని సమస్యలు వస్తూ వచ్చాయి. అయితే కొందరు కావాలని మనోభావాల పేరుతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తుంటారు. అయితే అభ్యంతరకరం సమాజ వ్యతిరేకంగా ఉంటేనే ఆహ్వానించాలి. అంతేకానీ ప్రతి భిన్నాభిప్రాయానికి సినిమా ఆపేయాలని పరిస్థితి వస్తే సృజనాత్మకత స్వేచ్ఛకు అడ్డుకట్ట పడినట్టే. ఈ విషయంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఫిలిం మేకర్స్ కు ధైర్యాన్ని ఇచ్చేలా ఉన్నాయి. స్వేచ్ఛగా సినిమాలు తీసేందుకు వెసులుబాటు కలగనుంది.

సందడిగా బాలోత్సవ్









- రెండో రోజూ ఐదు అంశాలపై పోటీలు
- అలరించిన చిన్నారులు
- జానపద నృత్యాలు హైలెట్
- మానవ సంబంధాలపై కథలు చెప్పిన విద్యార్థులు
- ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ షో

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: బివికె ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బాలోత్సవ్‌లో చిన్నారులు సందడి చేశారు. ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో జరుగుతున్న బాలోత్సవ్‌లో చిన్నారులు పలు అంశాలపై పోటీలు పడి అలరించారు. శుక్రవారం ఐదు అంశాలపై పోటీలు జరిగాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జరిగిన జానపద నృత్య పోటీలు అలరించాయి. విద్యార్థులు పోటాపోటీగా ప్రదర్శనలిచ్చారు.

జానపద నృత్యం : జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జానపద నృత్య పోటీలు జరిగాయి. ఈ పోటీలకు లారెన్స్, భరత్, రవి వ్యవహరించారు.

కథలు చెప్పడం : ఈ పోటీలు జూనియర్స్ విభాగంలో జరిగాయి. చిన్నారులు అద్భుతంగా తమ లోని ప్రావీణ్యాన్ని బయటపెట్టారు. పర్యావరణం, సంస్కృతి, సంప్రదాయాలు, మంచి అలవాట్లు తది తర అంశాలపై కథలు చెప్పారు. హవభావాలతో చెప్పడం అందరినీ ఆకట్టుకుంది. ఈ పోటీ లకు రిటైర్డ్ ఉపాధ్యాయులు రౌతు రవి, పురిమళ్ల సునంద, వ్యక్తిత్వ వికాస నిపుణులు తాళ్లూరి లక్ష్మీ న్యాయునిర్ణేతలుగా వ్యవహరించారు.

బెస్ట్ ఫ్రం వేస్ట్: ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పనికిరాని వస్తువులతో ఉపయోగపడే వస్తువులను తయారు చేయడం ఈ పోటీలోని ప్రధానాంశం. పాత టైర్లతో టాబేలు బొమ్మ తయారు చేయడం ఆకట్టుకుంది. స్మార్ట్ విలేజ్ ఎలా ఉండాలో పనికిరాని వస్తువులతో తయారు చేసిన చూపిన విధానం అందరినీ అలరించింది.

స్పెల్‌బీ పోటీ: ఈ పోటీలకు ఎస్‌కె అక్రమ్, శ్రీదేవి న్యాయునిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఫ్యాన్సీ డ్రెస్ : ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు పిల్లలు వివిధ వేషధారణలతో ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొన్నారు. రాబోయే యుగంలో మానవుడు ఎలా ఉంటారనే అంశంపై ఓ విద్యార్థి వేసిన వేషం ఆకట్టుకుంది. ఆలోచింపచేసింది. సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, అన్నదాత, తదితర వేషధారణలతో పిల్లలు ఆకట్టుకున్నారు.

నేడు విజేతలకు బహుమతులు ప్రదానం

బాలోత్సవ్‌లో రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతి ప్రదా నోత్సవం ఉంటుందని కన్వీనర్ వై.శ్రీనివాసరావు, కో ఆర్డినేటర్ కె.హిమబిందు పేర్కొన్నారు.పది అంశాల్లో పోటీలు జరుగగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులుగా ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బివికె సభ్యులు వాసిరెడ్డి వీరభద్రం, కళ్యాణం నాగేశ్వరరావు, తుమ్మల వెంకట్రావ్, ఎన్.గోవిందరావు, జి.రామారావు, అప్జల్‌మియా, సామినేని నాగేశ్వరరావు, ఎస్‌కె ఎమ్‌డిజాన్, నెల్లూరి వీరబాబు, ఎం.సుబ్బారావు, టి.శివన్నారాయణ, మోహన్, గుంటుపల్లి శ్రీదేవి, సిహెచ్ వెంకటేశ్వరరావు, వై.రవికుమార, అనుమతి, పుచ్చకాయల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కూకట్ పల్లి ట్రక్ పార్క్ వేలానికి
హైకోర్టు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి తెలంగాణ హైకోర్టులో లైన్ క్లియర్ అయింది. ఈ భూముల వేలాన్ని నిలిపివేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను (పిల్స్) హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (నవీణూ) నిర్వహించ తలపెట్టిన ఈ-వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది.కూకట్‌పల్లి మండలం మూసాపేట పరిధిలోని దాదాపు 3.15 ఎకరాల ట్రక్ పార్క్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులకు లేదా సంస్థలకు విక్రయించవద్దని, ట్రక్ పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని యథాతథంగా ఉంచాలని కోరుతూ కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సామాజిక కార్యకర్త మాధవరం కాంతారావుతో పాటు ట్రక్ పార్క్ అసోసియేషన్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన ఈ భూమికి కంచె వేసి రక్షించాలని పిటిషనర్లు కోరారు.(ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. ఇరుపక్షాల వాదనలను పరిశీలించింది. ఈ పిటిషన్లలో ఎలాంటి ప్రజా ప్రయోజనం కనిపించడం లేదని న్యాయస్థానం స్పష్టం చేస్తూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే ట్రక్ యజమానులు ఎవరూ కోర్టును ఆశ్రయించలేదని ధర్మాసనం గుర్తుచేసింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో, హెచ్ఎండీఏ అధికారిక షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సమయానికి ఈ-వేలం నిర్వహణకు సన్నాహాలు పూర్తి చేసింది. ఈ భూమి విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

రాజకీయ కాకలో 'బావర్చి'!



క్రైమ్ మిర్రర్, హైదరాబాద్: హైదరాబాద్ బిర్యానీకి జాతీయ స్థాయిలో సైతం మంచి గుర్తింపు ఉంది. అందులోనూ బావర్చి బిర్యానీని ఇష్టపడని వారు ఉండరు. అటువంటి బావర్చి బిరియాని హోటల్ రాజకీయ ఘర్షణలకు వేదికగా మారింది. దానికి కారణం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. 2023 నవంబర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇదే హోటల్ కు వచ్చారు. బిర్యానీ తింటూ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోని రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని.. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటన జరిగి సరిగ్గా మూడేళ్లు పూర్తయిన సందర్భంగా.. ఆ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాహుల్ గాంధీకి గుర్తు చేసేందుకు గులాబీ పార్టీ సోషల్ మీడియా బృందం, యూత్ లీడర్స్ వినూత్న నిరసన చేపట్టారు బావర్చి బిర్యానీ పాయింట్ వద్ద..

ఇరువర్గాల ఘర్షణ..

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చిత్రపటం, బొమ్మను ఏర్పాటు చేసి దానికి బిర్యానీ తినిపిస్తూ నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ ఒక రాజకీయ పర్యాటకుడిలా వచ్చి వెళ్తున్నారు తప్ప.. నాడు ఇదే టేబుల్ వద్ద కూర్చొని నిరుద్యోగులకు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని పట్టించుకోవడం లేదు అంటూ గులాబీ పార్టీ నేతలు విమర్శలు గుప్పించారు. సరిగ్గా అదే సమయంలో అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు నేతలు ఈ నిరసన కార్యక్రమం పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం మొదలైంది. స్వల్ప తోపులాటకు దారి తీసుకోవడంతో హోటల్ ఆవరణలో గందరగోళం నెలకొంది. అయితే ఈ ఘటనతో బిర్యానీ తినేందుకు వచ్చిన వారు భయంతో పరుగులు తీశారు.

అదుపు తప్పిన వైనం..

అయితే తెలంగాణలో ఒక రాజకీయ పరమైన వివాదానికి.. బావర్చి బిర్యానీ హోటల్ వేదిక కావడం ఒక్కసారిగా రచ్చకు దారితీసింది. కొందరు కాంగ్రెస్ కీలక నేతలు అక్కడికి రావడంతో పరిస్థితి మరింత దిగజారింది. అయితే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనవసరంగా రాజకీయ వివాదానికి బావర్చి బిర్యాని హోటల్ బలి కావడం ఆందోళనకు దారితీసింది. కేవలం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బసచేసినందుకుగాను బావర్చి హోటల్ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 | శనివారం | 28-11-2026

ప్రతి పౌరుడికి న్యాయం పొందే హక్కు ఉంది

● ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ న్యాయానికి దూరం కావొద్దు : సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య ● గారకుర్తి గ్రామంలో న్యాయ అవగాహన కార్యక్రమం

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 27: ప్రతి పౌరుడికి న్యాయం పొందే హక్కు ఉందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కాకూడదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కొండాపూర్ మండలం గారకుర్తి గ్రామంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వివిధ చట్టాలు, పౌరుల హక్కులు, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, ఆర్థికంగా వెనుకబడినవారు, సమాజంలోని బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు చట్టాలు కల్పిస్తున్న రక్షణలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఆమె సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా న్యాయపరమైన సమస్య ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను



సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని వివరించారు. ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హతలు, మహిళల హక్కులు, గృహ హింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోటారు వాహన ప్రమాద బాధితులకు అందించే పరిహారం, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం తదితర అంశాలను వివరించారు. న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం, న్యాయ సేవలను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, మండల వ్యవసాయ అధికారి గణేష్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ హాస్టళ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. లక్ష్మణ్, టి. అర్జున్ డిమాండ్

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 27: సంగారెడ్డి జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. లక్ష్మణ్, టి. అర్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని పలు సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్ల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకుల వినతిపై డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లను స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలిస్తానని, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, డిప్యూటీ డైరెక్టర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్ పాండు

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 27: విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు పాఠశాల పరిసరాల



నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు.

శుక్రవారం సదాశివపేటలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. తదుపరి పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌కు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.విద్యార్థులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన పరిసరాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పాఠశాల నిర్వహణను బాధ్యతాయుతంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ అనిత, సదాశివపేట ఎంఈఓ, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రాచూర్ వార్డు సభ్యుల రాజీనామా

క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి (వెల్దండ): వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు బి. సురేష్ రెడ్డి, కే. స్వాతి శివశంకర్ గురువారం భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. గత కొన్ని సంవత్సరాలుగా బీజేపీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేశామని తెలిపారు. ఇన్నేళ్లుగా పార్టీలో తమకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

దివ్యాంగుల స్వావలంబనే లక్ష్యం కావాలి



పీర్ ట్రైనింగ్‌తో దివ్యాంగులకు సాధికారత

స్వతంత్ర జీవనానికి సమాన అవకాశాలు కల్పించాలి

జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 27: వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో స్వతంత్రంగా జీవించేలా అవకాశాలు కల్పించాలని సంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి పేర్కొన్నారు. దివ్యాంగుల స్వావలంబన, సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రుద్రారం డోయన్ కౌంటీ టౌన్‌షిప్‌లోని ట్రియో రిసార్ట్స్‌లో మోటివేషన్ ఇండియా, స్టైనల్ కార్డ్ ఇంజురీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో స్టేట్ స్ట్రీట్, క్యాఫ్ అమెరికా సహకారంతో నిర్వహిస్తున్న మూడు రోజుల పీర్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు ఆమె ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తుల పునరావాసం, స్వావలంబన, జీవన నైపుణ్యాల అభివృద్ధికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని లలిత కుమారి అన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సమాజంలో సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీఐఏటీ రాష్ట్ర అధ్యక్షుడు షఫీ మాట్లాడుతూ.. వెన్నుపాము గాయాలకు గురైన వారికి వైద్య చికిత్సతో పాటు సామాజిక, ఆర్థిక పునరావాసం కూడా ఎంతో అవసరమన్నారు. ఇతరులపై ఆధారపడే స్థితి నుంచి స్వతంత్రంగా జీవించే స్థాయికి చేరుకోవడంలో పీర్ ట్రైనింగ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దివ్యాంగులకు సానుభూతి కంటే సమాన అవకాశాలు, అందుబాటులో ఉండే మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం పట్ల జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి చూపుతున్న ప్రత్యేక చొరవను షఫీ అభినందించారు. రాష్ట్రంలో ముందుగా హెచ్ఎస్ఎన్ క్యాంపు నిర్వహించడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల రోస్టర్ రిజిస్టర్లను పరిశీలించి సంగారెడ్డి జిల్లాలో దివ్యాంగులకు సంబంధించిన సుమారు 48 ఉద్యోగ ఖాళీలను గుర్తించడంలో ఆమె చేసిన కృషిని కొనియాడారు.మోటివేషన్ ఇండియా ప్రతినిధులు సుధాకర్, నందిని శ్రీనివాసన్, రాము మాట్లాడుతూ.. పీర్ ట్రైనింగ్ ప్రాధాన్యతను, వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవసరమైన శిక్షణ, సహకారం గురించి వివరించారు. ఈ శిక్షణలో వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులే తమ జీవన అనుభవాలను తోటి వారికి పంచుకుంటూ వీల్‌చైర్ వినియోగం, రోజువారీ జీవన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం వంటి అంశాల్లో శిక్షణ అందించడం ప్రత్యేకతగా నిలిచింది. కార్యక్రమంలో పీర్ ట్రైనర్లు, వెన్నుపాము గాయాలకు గురైన వ్యక్తులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

రైస్ మిల్లర్లకు అదనపు కలెక్టర్ ఆదేశాలు



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్): జిల్లాలో ధాన్యం మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ అదనపు కలెక్టర్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం జిల్లా స్థాయిలో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రా రైస్ మిల్లర్లు, బాయిల్డ్ రైస్ మిల్లర్ల ఒప్పందాలు, సివిల్ సప్లై కార్పొరేషన్‌కు సీఎంఆర్ ధాన్యం డెలివరీ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... మిల్లింగ్‌కు సంబంధించిన ఒప్పందాలు, ఇతర ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సీఎంఆర్ ధాన్యం డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే లక్ష్యాల్లో 100 శాతం పురోగతి సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటిస్తూ నిర్దేశిత సమయంలో మిల్లింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ. కృష్ణ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాజేందర్, సహాయ పౌరసరఫరాల అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎల్లాపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

ఉచిత కంటి వైద్య శిబిరం

క్రైమ్ మిర్రర్,పాలకీడు : పాలకీడు మండలం ఎల్లాపురం గ్రామంలో లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు షేక్ యూసుఫ్, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల సురేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించేందుకు లయన్స్ క్లబ్ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని తెలిపారు. శుక్రవారం నిర్వహించిన శిబిరంలో సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 18 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని కంటి సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, ఎల్సీఐఎఫ్ కోఆర్డినేటర్ గుండ్రెడ్డి సైదిరెడ్డి, ఉపాధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు, ధర్మరాజు, కంటి వైద్య నిపుణులు ఇందిర, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, గ్రామపంచాయతీ సిబ్బంది విజయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌సాగర్ ఎకో హిల్ పార్క్‌ను సందర్శించిన గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఉన్నతాధికారులు

పచ్చదనం, ప్రకృతి సౌందర్యం, బర్డ్ ఏవియరీపై ప్రశంసలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): హిమాయత్‌సాగర్ ఎకో హిల్ పార్క్ పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు నిలయంగా నిలుస్తోందని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఉన్నతాధికారుల బృందం ప్రశంసించింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి.ఎస్. సమీరన్ నేతృత్వంలోని అధికారుల బృందం హిమాయత్‌సాగర్ ఎకో హిల్ పార్క్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా పార్క్‌లో అభివృద్ధి చేసిన పచ్చని వాతావరణం, సుందరమైన ప్రకృతి దృశ్యాలు, ఆహ్లాదకరమైన పరిసరాలు, ప్రశాంత వాతావరణాన్ని అధికారులు ఆసక్తిగా పరిశీలించి అభినందించారు. ముఖ్యంగా పార్క్‌లో ఏర్పాటు చేసిన బర్డ్ ఏవియరీ వారిని విశేషంగా ఆకట్టుకుంది. అక్కడ ఉన్న వివిధ రకాల రంగురంగుల పక్షులను తిలకించి, వాటి సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణపై ఆసక్తి కనబరిచారు. ప్రకృతికి దగ్గరగా సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో హిమాయత్‌సాగర్ ఎకో హిల్ పార్క్ చేస్తున్న కృషిని అధికారులు ప్రశంసించారు. పక్షుల సహజ ఆవాసాల పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, ప్రకృతి ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించడం వంటి అంశాల్లో పార్క్ నిర్వహణ తీరును అభినందించారు. ఈ సందర్శనలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ (హెల్త్) ఠాకరే శుభం జ్ఞానదేవరావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. బాను కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎ.ఎం. మహతేవన్ పాల్గొన్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఉన్నతాధికారుల ప్రశంసలు హిమాయత్‌సాగర్ ఎకో హిల్ పార్క్ అభివృద్ధికి మరింత ప్రోత్సాహాన్నిస్తాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతి సౌందర్యం, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు వేదికగా ఈ పార్క్ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.

ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు వంద శాతం పూర్తి చేయాలి..జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్





సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 27: ఎల్ నినో ప్రభావం, భూగర్భ జలమట్టాల తగ్గుదల నేపథ్యంలో రాబోయే వ్యవసాయ సీజన్‌కు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని, జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాబోయే వ్యవసాయ సీజన్‌కు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలమట్టాలు సాధారణ స్థాయి కంటే తగ్గి సుమారు 19 మీటర్ల లోతుకు చేరుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.రాబోయే వ్యవసాయ సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల శనగ వంటి పప్పుధాన్యాలు, తెల్ల కుసుమ వంటి నూనెగింజలు, చిరుధాన్యాలు, ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంటల మార్పిడి, నీటి పొదుపు పద్ధతులను పాటించేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పంట కోతల అనంతరం మిగిలే కొయ్యకాళ్లు, ఇతర పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం, మల్చింగ్, జీవ విచ్ఛిన్నకారకాల వినియోగం వంటి పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి రైతు వివరాలను కచ్చితంగా నమోదు చేసి అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.ఎల్ నినో ప్రభావం, భూగర్భ జలాల పరిరక్షణ, పంటల మార్పిడి, తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే విధానాలపై గ్రామసభలు, రైతు సమావేశాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించి, నీటి వనరులను పొదుపుగా వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని, వ్యవసాయ శాఖ కార్యక్రమాల అమలుకు అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరారు.

హెచ్‌జీసీఎల్ రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎండీ ఉపేందర్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఉపేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని రహదారుల సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిస్మత్‌పూర్, నార్సింగి, మణికొండ, గొల్లపల్లి ప్రాంతాల్లో చేపట్టాల్సిన, పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల పనులు ఆలస్యం కావడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులను వెంటనే పునఃప్రారంభించి, నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని ఎండీ ఉపేందర్ రెడ్డిని కోరారు. రహదారుల అభివృద్ధి పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రోడ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ పాల్గొన్నారు....



రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

మెటామైండ్ కళాశాలలో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏసీపీ నాగభూషణం సూచన



గండిపేటక్రైమ్ మిర్రర్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ పి. నాగభూషణం సూచించారు. అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్‌లోని మెటామైండ్ కళాశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పి. నాగభూషణం, శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో మాట్లాడి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు, కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రాణాపాయ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను తమ బాధ్యతగా భావించాలని పోలీసులు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్ మహా పాదయాత్ర ముగింపు సభలో తోకల శ్రీనివాస్ రెడ్డి



రాజేంద్రనగర్ నుంచి

గండిపేట(క్రైమ్ మిర్రర్): యువత భవిష్యత్తును మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా నిర్వహించిన మూడు రోజుల హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్ మహా పాదయాత్ర ముగింపు సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో పాటు బీజేపీ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి సైతం మహా పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ విద్యార్థులు డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో తమ సృజనాత్మకతను చాటుకుంటూ చిత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో విద్యార్థుల భాగస్వామ్యం ఒక మంచి ముందడుగు అని పేర్కొన్నారు. చిన్నారులకు నషా ముక్త్ భారత్ లక్ష్యం గురించి పూర్తిస్థాయిలో తెలియకపోయినా, తమ ఉజ్వల భవిష్యత్తు కోసం సాగుతున్న ఈ ఉద్యమంలో వారు భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. చిన్నారుల చిరునవ్వులు ఎప్పటికీ స్వచ్ఛంగా ఉండాలంటే మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. యువతే దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా విద్య, ఉద్యోగాలు, క్రీడలు, దేశ అభివృద్ధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో భాగస్వామి కావాలని, మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాపై సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉందాం.. యువత భవిష్యత్తును కాపాడుకుందాం.. ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దాం అని తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.

తెలంగాణ పోలీస్ అకాడమీ ట్రైనీ డీఎస్పీలకు పతకాల పంట

ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026లో సత్తాచాటిన మహిళా అధికారులు



గండిపేటక్రైమ్ మిర్రర్: ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026లో పలు పతకాలు సాధించిన ట్రై నీ డీఎస్పీలు నేహా పురోహిత్, లతీఫా ఆశాలను తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ అభినందించారు. నవంబర్ 19 నుంచి 24వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో గెజిటెడ్ అధికారుల విభాగంలో ఇద్దరు అధికారులు విశేష ప్రతిభ కనబరిచారు. మహిళల డబుల్స్‌లో స్వర్ణం, మిక్స్‌డ్ డబుల్స్‌లో రజతం, మహిళల సింగిల్స్‌లో కాంస్యం పతకాలను నేహా పురోహిత్ సాధించారు. అలాగే లతీఫా ఆశా మహిళల డబుల్స్‌లో స్వర్ణం, మహిళల సింగిల్స్‌లో కాంస్యం స్యాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష బిస్ట్ విజేతలను అభినందిస్తూ క్రీడలు పోలీసు అధికారుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, యువతకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అకడమిక్ కన్సల్టెంట్, రిటైర్డ్ అదనపు ఎస్పీ జి.వెంకటారావు, ఎస్పీ(అడ్మిన్) కె.ఆర్.కె.ప్రసాద్ తదితరులున్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

ప్రభుత్వ భూముల వేలానికి హెచ్ఎండీఏకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ట్రక్ పార్క్ భూముల వేలంపై హైకోర్టు తీర్పుతో ఎమ్మెల్యే కృష్ణారావు ఆందోళన...ప్రజల్లో నవ్వులపాలు

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి





బాలానగర్, నవంబర్ 27 (క్రైమ్ మిర్రర్) : కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని అడ్డుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గత కొద్ది రోజులుగా చేపట్టిన ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) కోర్టు కొట్టివేసిందని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ భూముల వేలానికి హెచ్ఎండీఏకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే చేపట్టిన ఆందోళనలు ప్రజల్లో నవ్వులపాలయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల్లో అప్రతిష్టపాలు చేయాలనే దురుద్దేశంతోనే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ ఆందోళనలు చేపట్టారని యుగంధర్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ హడావుడి చేసిన ఎమ్మెల్యే, కోర్టు తీర్పుతో ప్రజల ముందు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని విమర్శించారు. 'చెడపకురా.. చెడేవు' అన్న చందంగా ప్రభుత్వాన్ని విమర్శించాలనే ప్రయత్నంలో స్వయంగా ఎమ్మెల్యేనే విమర్శలకు గురయ్యారని ఘాటుగా వ్యాఖ్యానించారు.ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలం ప్రక్రియ చేపడుతోందని యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం సరికాదని ఆయన అన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కారం

మాజీ కార్పొరేటర్ కోలుకుల జగన్



కుత్బుల్లాపూర్, నవంబర్ 27 (క్రైమ్ మిర్రర్): జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న ప్రజా సమస్యలను ప్రజల సహకారాలతో దశలవారీగా పరిష్కరిస్తానని మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు.డివిజన్ పరిధి రింగ్ బస్తీలో రూ. 5 లక్షల వ్యయంతో మంజూరైన బోర్ ను శుక్రవారం స్థానికులతో కలిసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ప్రాంతాన్ని రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు.ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు కొలుకు ల జైహింద్, సీనియర్ నాయకులు డి పాపులు గౌడ్,యాదగిరి,వెంకటేష్ ,మనోజ్,జగదీశ్,పాండు,అరుణ్,మంజుల,స్థానికులు పాల్గొన్నారు.



నాలుగేళ్లుగా వేతనాల కోసం
ఎదురుచూపులు..

14 మంది ఆరోగ్య శాఖ కాంటింజెంట్ కార్మికుల ఆవేదన

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్

గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంటింజెంట్ కార్మికులకు నెలసరి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. జిల్లా డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ సూపరింటెండెంట్ సంతోష్‌ను కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుమార్, జిల్లా సీనియర్ నాయకుడు ఈ. నరసింహ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో 14 మంది కాంటింజెంట్ కార్మికులు గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారికి నెలకు చెల్లించాల్సిన రూ.5,200 వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించాలని పలుమార్లు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. వేతనాల కోసం ఏళ్ల తరబడి డీఎంహెచ్ఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ, జీవో రాలేదని, బడ్జెట్ కేటాయింపులు జరగలేదని అధికారులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. 'ఇప్పుడు వస్తుంది.. అప్పుడొస్తుంది' అంటూ గడువు పొడిగిస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే నాలుగేళ్లుగా వేతనాలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువ మంది వయోవృద్ధులని, వారి పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. కార్మికుల వివరాలు, విధులకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం, లోపాలు ఉండటం వల్లే నేడు ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. తక్షణమే 14 మంది కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో కార్మికుల హక్కుల సాధన కోసం ఆందోళనలు, పోరాటాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

వెల్దండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఐజీ జి. చందనా దీప్తి

రికార్డులు, దర్యాప్తు ఫైళ్ల పరిశీలన.. పోలీస్ సిబ్బంది సమస్యలపై ఆరా



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ): వార్షిక తనిఖీల్లో భాగంగా జోగులాంబ జోన్ ఇన్‌చార్జి డీఐజీ జి. చందనా దీప్తి, ఐపీఎస్ శుక్రవారం వెల్దండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, ఐపీఎస్ డీఐజీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ తనిఖీలో కల్వకుర్తి ఇన్‌చార్జి డీఎస్పీ, అచ్చంపేట డీఎస్పీ, వెల్దండ సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్ఐ యుగంధర్ రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు ఫైళ్లను డీఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల విచారణలో అనుసరిస్తున్న విధానాలను సమీక్షించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా దొంగతనాల నియంత్రణకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కిషన్ రెడ్డి పాదయాత్ర ఎన్నికల స్టంట్: జగ్గారెడ్డి

డ్రగ్స్, గంజాయిపై సీఎం రేవంత్ ఉక్కుపాదం మోపారు

రాహుల్ గాంధీ ప్రధాని కావడం కొత్త కాదు.. బీజేపీ నేతలకే పదవులు కొత్త

మహేశ్వర్ రెడ్డి ముందు బీజేఎల్పీ నేతగా గుర్తింపు తెచ్చుకో: మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 27: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలు, నాయకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరినట్లు తెలిపారు. ప్రజలకు, కార్యకర్తలకు చేయాల్సిన పనుల్లో ఏమైనా పెండింగ్ ఉంటే పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సూచించినట్లు చెప్పారు. ఎఐసిసి ఇన్‌చార్జి బి.ఎం. సందీప్‌ను కలిసిన సందర్భంగా జగ్గారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. సందీప్‌తో ఎలాంటి రాజకీయ చర్చ జరపలేదని, తనకు వ్యక్తిగతంగా ఎలాంటి ఫిర్యాదులు లేవని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపడుతున్న పాదయాత్రపై జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు చర్యలు ప్రారంభించారని తెలిపారు. విద్యాసంస్థల్లో సైతం గంజాయి వెలుగుచూసిన సందర్భాల్లో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందన్నారు. డ్రగ్స్ వినియోగించిన వారు ఎంతటి వారైనా, అక్రమ వ్యాపారంలో ఎవరున్నా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని పేర్కొన్నారు. నార్కోటిక్స్, ఈగల్ టీమ్‌ల ద్వారా డ్రగ్స్ సరఫరాపై పోలీసులు కట్టడి చర్యలు చేపట్టారని, సినీ ప్రముఖులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. డ్రగ్స్, గంజాయిపై ప్రభుత్వం ఇప్పటికే ఉక్కుపాదం మోపిన తర్వాత కిషన్ రెడ్డికి పాదయాత్ర చేయాలనే ఆలోచన వచ్చిందా అని ప్రశ్నించారు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు పాదయాత్ర గుర్తుకు రావడం వెనుక ఎన్నికల ప్రయోజనాలే ఉన్నాయని, కిషన్ రెడ్డి యాత్ర ఎన్నికల స్టంట్ మాత్రమేనని విమర్శించారు. ఇది ప్రజా సమస్యలపై చేసే యాత్ర కాదని, కేవలం ప్రచారం కోసం చేపట్టిన షో పుటప్ యాత్రగా అభివర్ణించారు. రాహుల్ గాంధీ ప్రధాని కాలేరంటూ బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదమని జగ్గారెడ్డి అన్నారు. ప్రధాని పదవి రాహుల్ గాంధీ కుటుంబానికి కొత్త కాదని, బీజేపీ నేతలకే పదవులు కొత్త అని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడానికి డీలిమిటేషన్ అడ్డంకి కాకపోతే 14, లేకపోతే 20 ఎంపీ స్థానాలు గెలవడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పనిచేస్తున్నారని తెలిపారు.

బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై కూడా జగ్గారెడ్డి విమర్శలు చేశారు. ముందుగా బీజేఎల్పీ నేతగా రాజకీయంగా తనకంటూ గుర్తింపు తెచ్చుకోవాలని, ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయాలని హితవు పలికారు.

అగ్రి వర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

డిసెంబర్ 21న పట్టాల ప్రదానం.. 17 మందికి బంగారు పతకాలు

ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. డిసెంబర్ 21వ తేదీన రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన జరగనున్న ఈ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరుకానున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఒక ప్రకటనలో వెల్లడించారు. గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి అనుమతితో సెప్టెంబర్ నెలలోనే రాష్ట్రపతిని స్నాతకోత్సవానికి ఆహ్వానించినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం 60 ఏళ్ల చరిత్రతో పాటు గత మూడేళ్లలో సాధించిన ప్రగతిని పరిశీలించిన అనంతరం రాష్ట్రపతి ఈ ఆహ్వానాన్ని మన్నించి హాజరయ్యేందుకు అంగీకరించారని పేర్కొన్నారు. ఆరు దశాబ్దాల విశ్వవిద్యాలయ చరిత్రలో పలువురు ప్రముఖులు స్నాతకోత్సవాలకు హాజరయ్యారని జానయ్య గుర్తుచేశారు. 1969లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, 1971లో అప్పటి రాష్ట్రపతి వి.వి. గిరి, 1972లో అప్పటి ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు స్నాతకోత్సవాల్లో పాల్గొన్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి సైతం ఈ వేదుకలకు హాజరైనట్లు వివరించారు. సుమారు 55 ఏళ్ల తర్వాత మరోసారి దేశ రాష్ట్రపతి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి హాజరుకానుండటం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఎంతో గర్వకారణమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ స్నాతకోత్సవంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ పూర్తి చేసిన 40 మంది, పీజీ పూర్తి చేసిన 100 మంది, యూజీ పూర్తి చేసిన 1,000 మంది విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా పట్టాలు అందజేయనున్నారు.





అలాగే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 17 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయనున్నారు. మరో ప్రత్యేకతగా వైఎస్ఆర్--కేవీపీ ఫౌండేషన్ తరఫున విశ్వవిద్యాలయంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన ఒక విద్యార్థికి తొలిసారిగా లక్ష రూపాయల నగదు బహుమతితో పాటు బంగారు పతకాన్ని అందజేయనున్నట్లు ఉపకులపతి వెల్లడించారు. అదేవిధంగా ప్రముఖ అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్త, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ప్రస్తుత డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్‌కు ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

లారీల సమస్య పరిష్కరించాలి జిల్లా మంత్రి, కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

శివ్వంపేట సర్వీస్ రోడ్డుపై రైతుల ధర్నా

అధికారుల నిర్లక్ష్యంతోనే ధాన్యం తడిసిపోయింది

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 27: వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న లారీల సమస్యను తక్షణమే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం చౌటకూరు మండలం శివంపేట గ్రామ పరిధిలోని పీఎస్ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు జాతీయ రహదారి పక్కన ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులతో కలిసి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం శివంపేట సర్వీస్ రోడ్డుపై రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం తడిసిపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. గత వారం పది రోజులుగా అనేక కొనుగోలు కేంద్రాలకు లారీలు సకాలంలో రాకపోవడంతో తూకం వేసిన ధాన్యం బస్తాలు కేంద్రాల్లోనే నిలిచిపోయాయని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించడంలో అధికారులు కాలయాపన చేయడంతో ఆందోల్ నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో ధాన్యం వర్షాలకు తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరించకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రి, కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని, సన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలకు లారీలను వెంటనే సమకూర్చి ధాన్యం తరలింపులో ఆటంకాలు తొలగించాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, జిల్లా నాయకులు జైపాల్ రెడ్డి, వెంకటేశం, విష్ణువర్ధన్ రెడ్డి, రాంచందర్, మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వారంలోనే కాంట్రా-ఫ్లో బీఆర్‌టీఎస్.. సైబరాబాద్‌కు 510 కొత్త బస్సులు..

క్రైమ్ మిర్రర్ రాయదుర్గం: ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు వారం రోజుల్లోనే కాంట్రా-ఫ్లో బీఆర్‌టీఎస్ అమలు చేయనున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ప్రకటించారు. టి-హబ్‌లో జరుగుతున్న 'సైబరాబాద్ మూవ్స్ 2026' సదస్సులో ఆయన మాట్లాడుతూ, జేఎన్‌టీయూ నుంచి రాయదుర్గం వరకు ఈ సేవ ఉంటుందన్నారు. దీంతో కేపీహెచ్‌బీ, హైటెక్ సిటీ, రాయదుర్గం మెట్రో స్టేషన్లకు అనుసంధానం మెరుగవుతుందన్నారు. రాబోయే రెండేళ్లలో 450 ఏసీ, 60 మినీ బస్సులులి కలిపి 510 బస్సులు సైబరాబాద్‌కు ఇవ్వనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. ఐటీ ఉద్యోగుల కోసం ప్రత్యేక బస్సులు కూడా నడుపుతామన్నారు.ప్రజా రవాణా వాడకం పెరిగితేనే రద్దీ తగ్గుతుందని, ఈ విషయంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సీపీ, సీఎంసీ కమిషనర్ డా. జి. సృజన సూచించారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 28-11-2026
7

విభేదాలు సృష్టించొద్దు... ప్రజల మనిషి యదన్న..!

- రాజకీయ విభేదాలతో ప్రజలను తప్పదోవ పట్టించొద్దు
- ఎమ్మెల్యే వ్యక్తిత్వం సబితమ్మకు సుపరిచితం
- ఇంద్ర రెడ్డి కుటుంబం అంటే అందరికి అమితమైన అభిమానం
- వ్యక్తిగత విమర్శలు, రాజకీయ విభేదాలు సృష్టించడం చౌకబారుతనం..
- యదన్న వ్యక్తిత్వమే ప్రజల ఆదరాభిమానాలకు నిదర్శనం
- పెద్దలను గౌరవించడంలో అయన కీర్తి అనర్విచనీయం
- పనితోనే సమాధానం చెబుతాం.. • హామీలన్నీ నిరవేర్చాకే ప్రజల్లోకి వెళ్తాము



క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : ప్రజల మనిషిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలే గుర్తిస్తున్నారని, రాజకీయ విభేదాలు సృష్టిస్తూ ప్రజల్లో అపోహలు కల్పించడం సరికాదని కాంగ్రెస్ నాయకులు. చేవెళ్లలో జరిగిన చిన్న విషయాన్ని శంకర్‌పల్లిలో రాజకీయ వివాదంగా మార్చి, వ్యక్తిగత విమర్శలకు వేదికగా చేసుకోవడం చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య సబితా ఇంద్రారెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించలేదని, తప్పుడు ప్రచారంతో ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. ఇంద్రారెడ్డి కుటుంబం తమ కుటుంబమని, ఆ కుటుంబం పట్ల అందరికీ గౌరవాభిమానాలు ఉన్నాయని స్పష్టం చేశారు. గ్రామాల్లో గత మూడేళ్లుగా జరిగిన అభివృద్ధి పనులు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని, రహదారులు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీమా, పెన్షన్లు, ఉచిత విద్యుత్, గ్యాస్, ఇందిరమ్మ చీరలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి అంశాల్లో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు.గత పది సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఒంటరి మహిళ పెన్షన్లు,వితంతు పెన్షన్స్ ,వికలాంగుల పెన్షన్స్,గీత కార్మికుల పెన్షన్స్ దేశంలో ఎక్కడ లేని విధంగా ఇస్తున్న ఘనత మా ప్రభుత్వానిది.వెళ్లి తెలుసుకుంటే అన్ని తెలుస్తాయి ఒక్కొక్క గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇస్తున్నాము.ఒక్కొక్క గ్రామానికి వెళ్లి చూసి మాట్లాడండి పేదోడి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నాం.అన్ని రకాలుగా పేద వారి కన్నీళ్లు తూడ్చాడమే మా అజెండా,మా పనే మాకు దైవం,ప్రతి విమర్శకు పని తోనే సమాధానం చెబుతాం అని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రహదారి పనులకు టెండర్లు పూర్తవుతున్నాయని, త్వరలో పనులు చేపట్టి ప్రజలకు అభివృద్ధిని చూపిస్తామని వెల్లడించారు. రాజకీయ విమర్శలకు సమాధానం మాటలతో కాకుండా పనులతోనే చెబుతామని, వ్యక్తిగత దూషణలకు తాము తావివ్వబోమని పేర్కొన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కాలే యాదయ్యపై విమర్శలు చేసే ముందు విమర్శకులు తమ స్థాయిని, రాజకీయ నేపథ్యాన్ని ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తమ పార్టీ అధికారంలో ఉన్నందున ప్రజాప్రతినిధులకు పదవులు కేటాయించడం పార్టీ నిర్ణయమని, దానిపై ఇతరులు అనవసర ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. పదవులపై ఆసక్తి ఉంటే రాజకీయ విమర్శలకు బదులుగా పార్టీలో చేరి ప్రజాసేవకు ముందుకు రావాలని, వ్యక్తిగత ఆరోపణలు, విభేదాలు రెచ్చగొట్టే ధోరణి విడనాడాలని హితవు పలికారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని నాయకులు స్పష్టం చేశారు.కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి, సాత ప్రవీణ్ కుమార్ మున్సిపల్ చైర్మన్, బొల్లారం వెంకట్ రెడ్డి పి ఏ సి ఎస్ చైర్మన్ శంకర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతీ చంద్రమౌళి, సొసైటీ వైస్ చైర్మన్ పార్శి బాలకృష్ణ, గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ కౌన్సిలర్ గణేష్, డైరెక్టర్లు ప్రశాంత్ కుమార్ సామయ్య, మున్సిపల్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

నస్తీపూర్‌లో లబ్ధిదారుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ

పరిశీలించిన యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరిగుంతం కృష్ణ

హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 27: తెలంగాణలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లబ్ధిదారుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ హత్నూర మండలం నస్తీపూర్ గ్రామంలో కొనసాగుతోంది. గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి యాదయ్య లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరిగుంతం కృష్ణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డు కలిగిన 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల అర్హులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు ఒక నామినీని ఎంపిక చేసుకోవచ్చని, భార్య లేదా పిల్లల పేర్లను నామినీగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. నస్తీపూర్ గ్రామంలో మొత్తం 278 రేషన్ కార్డులు ఉండగా, ఇప్పటివరకు 28 మంది లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి యాదయ్య తెలిపారని డాక్టర్ వరిగుంతం కృష్ణ వెల్లడించారు. కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లతో పాటు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.అదేవిధంగా గ్రామానికి ఇప్పటికే 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో నాలుగు ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. రెండో విడతలో ఇళ్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా అధికారులతో మాట్లాడి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ, ఇందిరమ్మ కమిటీ సమన్వయంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మన్నె మహిపాల్, నస్తీపూర్ గ్రామానికి చెందిన మాచునూరి సతీష్, గ్రామ మహిళా నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





ఇందిరమ్మ జీవిత బీమా నమోదులో చండూరు మున్సిపాలిటీ టాప్..!

చండూరు, క్రైమ్ మిర్రర్: ఇందిరమ్మ జీవిత బీమా నమోదు కార్యక్రమం ఈనెల 19న ప్రారంభమైంది. చండూరు మున్సిపాలిటీలో 3,971 రేషన్‌కార్డులు ఉండగా గురువారం రాత్రి వరకు 1,961 కార్డులను పూర్తి చేశారు. జిల్లాలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో జరుగుతున్న నమోదును చూస్తే చండూరు మున్సిపాలిటీనే టాప్ పొజిషన్‌లో కొనసాగుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో నమోదు పూర్తి కానుంది. కాగ అప్పటి వరకు నమోదు కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది వార్డులలోకి వచ్చి చేపడుతారు. సోమవారం తర్వాత నమోదు మున్సిపాలిటీలోనే చేపడుతారు. కాబట్టి ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే నమోదు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డా.కోడి శ్రీనివాసులు, కమిషనర్ ఎల్.మల్లేషం తెలిపారు. నమోదును ఎప్పటికప్పుడు చైర్మన్ డా.కోడి శ్రీనివాసులు, కమిషనర్ మల్లేషం పర్యవేక్షిస్తున్నారు. కాగా సిబ్బంది సైతం నమోదులో చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. వార్డులలో నమోదు తక్కువగా ఉన్న వీధులలోకి వెళ్లి మరి అవగాహన పరుస్తూ నమోదు చేపట్టడం అభినందనీయం. కమిషనర్ మల్లేషం ఇక్కడ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కూడా చండూరు మున్సిపాలిటీని చాలా సందర్భాలలో జిల్లా, కొన్ని విషయాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి వరసలో నిలుపుతూ వస్తున్నారు. ఇందిరమ్మ జీవిత భీమా పథకంలో రేషన్ కార్డులో ఉండే కుటుంబ పోషకుడు ప్రమాదవశాత్తు లేదా ఎలా చనిపోయిన రూ.5లక్షలు ఆ కుటుంబానికి ప్రభుత్వం ఎల్ఐసీ ద్వారా చెల్లిస్తుంది. మనం చేయాల్సిందల్లా రేషన్‌కార్డులోని కుటుంబ పోషకుడు తన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డును తీసుకొని వెళ్లి నమోదు చేసుకోవటమే.

సచివాలయంలో బి ఆర్ ఎస్ వర్సెస్ కాంగ్రెస్...!

రాష్ట్రంలో ప్రోటోకాల్ యుద్ధం మొదలైంది..!

ఎమ్మెల్యేలకు అవమానం.. అధికారులపై సబితమ్మ ఫైర్..!

సి ఎస్ కు ఫిర్యాదు...ఇకపై ఉల్లంఘన చేస్తే ఊరుకోం..!



మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వేడి రాజుకుంది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పేరుతో బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలను అవమానిస్తున్నారనే ఆరోపణలతో సచివాలయం దద్దరిల్లింది.శుక్రవారం సాయంత్రం సచివాలయానికి దూసుకొచ్చిన బి ఆర్ ఎస్ బృందం, నేరుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి ఎస్ ని కలిసి ఫిర్యాదు చేసింది.

రంగంలోకి దిగిన సబితమ్మ టీం..!

బి ఆర్ ఎస్ శాసనసభాపక్ష ఉపనాయకురాలు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, నేతృత్వంలో ఎమ్మెల్యేలు కె.పి. వివేకానంద, డి.సుధీర్ రెడ్డి తదితరులు సి ఎస్ ను కలిసి జరుగుతున్న అవమానాలను వినతిపత్రంతో ఒక్కొక్కటిగా ఏకరువు పెట్టారు. అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుల హవా నడుస్తోందని బి ఆర్ ఎస్ ఆరోపిస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు ఆహ్వానం లేదు వేదికపై కూర్చోబెట్టేటప్పుడు ప్రోటోకాల్ పాటించడం లేదు ఎమ్మెల్యేలను పక్కన పెట్టి, కాంగ్రెస్ నేతలకే సీట్లు, మైకులు ఇస్తున్నారు. ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాలరాస్తున్నారు.దీంతో విసిగిపోయిన బి ఆర్ ఎస్ నేతలు, ఇక సహించేది లేదంటూ సి ఎస్ ముందు తేల్చి చెప్పారు.ప్రోటోకాల్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వండి.అందరూ సమానమే... అధికార పార్టీ అయినా, ప్రతిపక్షం అయినా.. ప్రజాప్రతినిధులందరినీ సమానంగా గౌరవించాలి. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోండి.ఈ ఫిర్యాదును పరిశీలించి, అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తామని సి ఎస్ హామీ ఇచ్చినట్టు తెలిసింది.కానీ బి ఆర్ ఎస్ నేతలు మాత్రం ఇది హామీలతో ఆగే విషయం కాదని, ప్రోటోకాల్ ఉల్లంఘన కొనసాగితే రోడ్డెక్కి పోరాటం చేస్తామనే హెచ్చరికలు చేస్తున్నట్టు సమాచారం.



బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్

గండిపేట(క్రైమ్ మిర్రర్): బాల్య వివాహం అనేది కేవలం ఒక సామాజిక సమస్య మాత్రమే కాదని, చిన్నారుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఒక దురాచారమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్ అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు రాజేంద్రనగర్ డివిజన్‌లోని రాజేంద్రనగర్ జూనియర్ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల చిన్న వయస్సులోనే పిల్లలు తమ బాల్యాన్ని, స్వేచ్ఛను కోల్పోతారని, ముఖ్యంగా బాలికల విద్యాభ్యాసం మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల వారి ఉన్నత విద్య, ఆర్థిక స్వావలంబన, భవిష్యత్తు ఆశయాలు దెబ్బతింటాయని వివరించారు. అంతేకాకుండా మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు, కుటుంబ పరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి బాలికకు చదువుకునే హక్కు, తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉండాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించకుండా వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, సమాజంలోని ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎంఆర్ఓ రాములు, ఎంఈఓ శంకర్ నాయక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, రగడంపల్లి శ్రవణ్, చెరుకుల రవి, ముడుమల శ్రీకాంత్, కె. రామకృష్ణ, మంగళారం శ్రీనివాస్, మహిళా నాయకులు యాదక్క, ఉమా మహేశ్వరి, యువజన నాయకుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి

కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకులకు తగిన గుర్తింపును ఇవ్వాలి



కూకట్ పల్లి, నవంబర్ 27 (క్రైమ్ మిర్రర్) : రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని కూకట్ పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతము కూకట్ పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గురించి మాట్లాడుతూ రేపు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే అవకాశాలు ఉన్నాయని, వాటి కోసం ప్రభుత్వ పథకాలు కింది స్థాయిలోకి వెళ్ళే విధంగా కష్టపడి పనిచేయాలని అన్నారు. అలాగే పాత కాంగ్రెస్ పార్టీ నాయకులను గుర్తించి శక్తి యాప్, డిజిటల్ మెంబర్ షిప్ తో పాటు రేవంత్ రెడ్డి ఎంపీ గా పోటీ చేసిన సందర్భంలో ప్రతి కరుడు కట్టిన కాంగ్రెస్ వాది కి తగిన విధంగా గుర్తింపు ఇవ్వాలని వేం నరేందర్ రెడ్డిని వారు కోరారు. తక్షణమే స్పందించిన ఆయన ఏ ఐ సి సి సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి సందీప్ ని, తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ తో కూడా చర్చించాలని ఆయన సూచించారు. వేం నరేందర్ రెడ్డి చెప్పిన విధంగా ఇంచార్జి సందీప్ ని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని కలిసి కూకట్ పల్లి నియోజకవర్గ పరిస్థితి చర్చించడజరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు చందిరి కొండల్ రెడ్డి పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 శనివారం 28-11-2026



కార్మికుల సంక్షేమ పనుల్లో జాప్యం వద్దు

అధికారులతో సమీక్షలో మందమర్రి జీఎం ఎన్. రాధాకృష్ణ

మందమర్రి నవంబర్ 27 (క్రైమ్ మిర్రర్) : కార్మికుల సంక్షేమం, పరిపాలనాపరమైన అంశాల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం మందమర్రిలోని తన కార్యాలయంలో పర్సనల్, అకౌంట్స్, సివిల్, ఐఈడీ విభాగాల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా చేపడుతున్న పనుల ప్రగతిని జీఎం అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఏరియా అభివృద్ధికి తోడ్పడాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్వోటు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, డీజీఎంలు సిహెచ్. అశోక్ (పర్సనల్), కె. కిరణ్ కుమార్ (ఐఈడీ), మదీనా భాష (సివిల్), తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



మిర్యాలగూడ, నవంబరు 27 (క్రైమ్ మిర్రర్): మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి--అద్దంకి రాష్ట్ర రహదారిపై వై జంక్షన్ వద్ద ఈ నెల 29న ప్రతిష్ఠించనున్న 54 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలకు ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహోత్సవాల్లో భాగంగా గణపతి పూజ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, జలాధివాసం తదితర క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధ బాలకృష్ణ దంపతులు, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్‌కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తిరునగరు భార్గవ్, నాగలక్ష్మి భార్గవ్ దంపతులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారమహోత్సవం



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: తీవ్ర సంక్షోభంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమ నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం తగు ప్రోత్సాహకాలు అందజేయాల్సిన, రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. నూతనంగా ఎన్నికైన ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకార మహోత్సవం స్వర్ణభారతి కళ్యాణ మండపంలో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, గ్రానైట్ పరిశ్రమకు ఖమ్మం ముఖ్యమైన కేంద్రంగా ఉందని,వివిధ కారణాల వల్ల ఇది సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు పోయి పోటీలు పడకుండా, బేధాభిప్రాయాలు విడనాడి సామరస్యంతో, సమన్వయంతో ఐక్యంగా ముందుకు సాగాల్సిందిగా తాను,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,పెద్దలు పారా నాగేశ్వరరావు తదితర ప్రముఖుల సలహా మేరకు ఈ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎంపీ రవిచంద్ర కార్యవర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల పరిష్కారానికి మనమందరం మరింత ఐకమత్యంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా అతిథులను నూతనంగా ఎన్నికైన కార్యవర్గం శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం

పెబ్బేరు, కొత్తకోట మండలాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఆక్రమణలు గుర్తించి వెంటనే తొలగించాలి

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అదనపు కలెక్టర్ టి. వినోద్ కుమార్



వనపర్తి, నవంబర్ 27 క్రైమ్ మిర్రర్: ప్రభుత్వ భూములను ఆక్రమించుకునే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని, ఆక్రమణలను గుర్తించిన వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం అదనపు కలెక్టర్ పెబ్బేరు, కొత్తకోట మండలాల్లో పర్యటించి ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులను తనిఖీ చేసి, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రంగాపూర్‌లో ప్రభుత్వ భూముల స్వాధీన ప్రక్రియ పరిశీలన పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామంలో ఆర్డీఓ జారీ చేసిన ప్రభుత్వ భూమి స్వాధీన (రెస్యూమ్) ఉత్తర్వుల అమలు తీరును పరిశీలించారు. భూములకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్వాధీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పాలెం, కొత్తకోటలో ఆక్రమణల గుర్తింపు

కొత్తకోట మండలం పాలెం గ్రామంలోని సర్వే నంబర్ 186, కొత్తకోట గ్రామంలోని సర్వే నంబర్ 175 పరిధిలోని ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా భూముల్లో జరిగిన ఆక్రమణల వివరాలను తెలుసుకుని, ప్రభుత్వ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించాలని, ఆక్రమణలను తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తహశీల్దారును ఆదేశించారు. ప్రభుత్వ భూములు ప్రజా అవసరాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడే విలువైన ఆస్తులని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. వాటి పరిరక్షణ బాధ్యతను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఆక్రమణలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి చదువు ఆగకుండా దాతల చేయూత..

అభినాష్ ఫీజులకు సాయం

రోడ్డు ప్రమాదంతో తండ్రి మంచానికే పరిమితం.. కుటుంబంపై ఆర్థిక భారం

ఇంటర్ ఫీజుల కోసం ఇబ్బందులు పడుతున్న కమ్మేట గ్రామ విద్యార్థి

స్పందించిన వాట్ నెక్స్ట్ ఫౌండేషన్.. దాతల సహకారంతో ఫీజు చెల్లింపు

వాసవి కళాశాల ప్రిన్సిపల్ రామచందర్ సైతం ఫీజులో రాయితీ

విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తున్న సేవా సంస్థలు



క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : ఆర్థిక కష్టాలు విద్యార్థుల చదువుకు అడ్డంకిగా మారకూడదనే సంకల్పంతో వాట్ నెక్స్ట్ ఫౌండేషన్ ముందుకొచ్చి ఓ నిరుపేద విద్యార్థికి అండగా నిలిచింది. చేవెళ్ల నియోజకవర్గం కమ్మేట గ్రామానికి చెందిన గొల్లగూడెం అభినాష్ ఇంటర్మీడియట్ చదువుకు ఫీజులు చెల్లించలేని దుస్థితిలో ఉండగా, ఫౌండేషన్ స్పందించి దాతల సహకారంతో ఫీజు చెల్లించేలా చర్యలు చేపట్టింది. 2023లో రోడ్డు ప్రమాదానికి గురైన అభినాష్ తండ్రి యాదయ్య మంచానికే పరిమితం కావడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో విద్యార్థి చదువు కొనసాగించేందుకు అవసరమైన ఫీజుల కోసం కుటుంబం ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వాట్ నెక్స్ట్ ఫౌండేషన్‌ను సంప్రదించారు. విద్యార్థి పరిస్థితిని తెలుసుకున్న ఫౌండేషన్ ప్రతినిధులు వెంటనే పలువురు దాతలను సంప్రదించి సహాయం సమీకరించారు. శంకర్‌పల్లి వాసవి ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ రామచందర్‌తో మాట్లాడి విద్యార్థి పరిస్థితిని వివరించగా, ఆయన సైతం అభినాష్ దీనస్థితిని అర్థం చేసుకొని ఫీజులో రాయితీ కల్పించారు. మిగిలిన ఫీజు మొత్తాన్ని పలువురు దాతలు చిన్నచిన్న మొత్తాలుగా సమకూర్చడంతో విద్యార్థి చదువు ఆగకుండా కళాశాల యాజమాన్యానికి ఫీజు చెల్లించారు. ఈ సహకారంలో శంకర్ పల్లి పి ఏ సి ఎస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి,శంకర్ పల్లి మున్సిపల్ అధ్యక్షుడు మాడపతి చంద్రమౌళి, మోకిలా గ్రామ సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్, సింగపూర్ 1వ వార్డు కౌన్సిలర్ ఆనంద్ రావు ,ప్రగతి ఎక్ట్రెస్స్ విలేకరి సోప్పగాళ్ల సంజీవ,ఉపాధ్యాయుడు రాములు,సుధాకర్ తదితరులు తమ వంతు సాయం అందించారు. చిన్న మొత్తాలుగా అందించిన విరాళాలు ఓ విద్యార్థి విద్యాభవిష్యత్తుకు పెద్ద అండగా నిలిచాయి. ఆర్థిక సమస్యల కారణంగా విద్యార్థులు చదువును మధ్యలో నిలిపివేయాల్సిన పరిస్థితి రాకూడదనే లక్ష్యంతో వాట్ నెక్స్ట్ ఫౌండేషన్ చేపట్టిన ఈ ప్రయత్నం అభినందనీయం. రాజకీయాలు, ఇతర కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావడం సేవా సంస్థల నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. అభినాష్ చదువు కొనసాగేందుకు పలువురు కలిసికట్టుగా చేసిన ఈ సహాయం మానవత్వానికి అద్దం పట్టింది.

సిటిజన్ ఆసుపత్రిలో "గుండె జబ్బులకు" సమగ్ర వైద్యం

అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ విజయవంతమైన మూడు బైపాస్‌లు

ఐదు రోజుల్లోనే కోలుకుని ఇంటికి చేరిన మహిళ

98 శాతం విజయవంతమైన శస్త్రచికిత్సల రేటు

ఏడాదిలో 190 గుండె ఆపరేషన్లు.. ఇద్దరు మాత్రమే మృతి

ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు గుండె చికిత్సలు

25 నుంచి 30 ఏళ్ల యువతలోను పెరుగుతున్న గుండె జబ్బులు

మధుమేహం, బీపీ, కొలెస్ట్రాల్‌తో గుండెకు ముప్పు

వారానికి 150 నిమిషాల వ్యాయామం తప్పనిసరి

మద్యపానం, పొగాకు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి

జీవనశైలిలో మార్పులతో గుండె జబ్బులకు చెక్

కార్డియాలజిస్ట్ డాక్టర్ గిరిధర్ హరి ప్రసాద్



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ బ్యూరో చీఫ్ నవంబర్ 27: గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆధునిక వైద్య సేవలు నల్లగండ్లలోని సిటిజన్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గిరిధర్ హరి ప్రసాద్ తెలిపారు. గుండె జబ్బులకు సంబంధించిన వివిధ రకాల చికిత్సలు, క్లిష్టమైన బైపాస్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కూడా అర్హులైన పేద రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

క్లిష్ట పరిస్థితుల్లోనూ విజయవంతమైన శస్త్రచికిత్స

ఇటీవల రాపాక ప్రమీల అనే మహిళ అత్యంత క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చారని, ఆమెకు మూడు బైపాస్‌లు అవసరమైన పరిస్థితి ఉందని డాక్టర్ గిరిధర్ హరి ప్రసాద్ వివరించారు. ఆమె పరిస్థితి దృష్ట్యా ప్రాణాలతో బయటపడే అవకాశాలు కూడా తక్కువగా ఉన్నప్పటికీ, వైద్య బృందం సమర్థవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిందన్నారు. ఆపరేషన్ అనంతరం ఐదు రోజుల్లోనే ఆమె కోలుకుని క్షేమంగా ఇంటికి వెళ్లారని తెలిపారు. తమ ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్సలకు 98 శాతం విజయవంతమైన ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు.

190 గుండె శస్త్రచికిత్సలు.. ఇద్దరు మాత్రమే మృతి

గత ఏడాది కాలంలో సుమారు 190 గుండె సంబంధిత శస్త్రచికిత్సలు నిర్వహించామని, వీటిలో ఇద్దరు రోగులు మాత్రమే మృతి చెందినట్లు డాక్టర్ వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా వైద్య గణాంకాల ప్రకారం గుండె శస్త్రచికిత్సలకు సంబంధించిన మరణాల రేటుతో పోలిస్తే తమ ఆసుపత్రిలో తక్కువగా ఉందన్నారు. శస్త్రచికిత్స అనంతరం రక్తస్రావం కారణంగా తిరిగి ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితులు కూడా తమ ఆసుపత్రిలో మూడు శాతం కంటే తక్కువగా ఉన్నాయని వివరించారు.

గుండె జబ్బులకు ప్రధాన కారణాలు

మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మద్యపానం, పొగాకు వినియోగం, వంశపారంపర్య కారణాలు గుండె జబ్బులకు ప్రధాన కారణాలని తెలిపారు. ముఖ్యంగా మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం, వ్యాయామం చేయకపోవడం, బయట ఆహారం, అధిక నూనెతో తయారైన పదార్థాలు తీసుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. చిన్న చిన్న పనులకు కూడా ఇతరులపై ఆధారపడటం, ఆన్‌లైన్ ఆర్డర్లకు అలవాటు పడటం వల్ల శారీరక శ్రమ తగ్గుతోందన్నారు. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

25 ఏళ్ల యువతలోనూ గుండె సమస్యలు

గతంలో వృద్ధుల్లో ఎక్కువగా కనిపించే గుండె జబ్బులు ప్రస్తుతం 25 నుంచి 30 ఏళ్ల యువతలోనూ కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో గుండె జబ్బుల సమస్య తీవ్రంగా ఉందని, ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న గుండె సంబంధిత వ్యాధుల్లో గణనీయమైన వాటా మన దేశంలోనే ఉంటోందని తెలిపారు. మధుమేహం, హైపర్‌టెన్షన్‌తో పాటు జన్యుపరమైన అంశాలు కూడా గుండె జబ్బులకు కారణమవుతున్నాయని వివరించారు.

వారానికి 150 నిమిషాల వ్యాయామం తప్పనిసరి

గుండె జబ్బులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని డాక్టర్ గిరిధర్ హరి ప్రసాద్ సూచించారు. వారానికి కనీసం 150 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని, వారంలో ఐదు రోజులు నడక, పరుగు, సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలకు సమయం కేటాయించాలని తెలిపారు. బయట ఆహారం, అధిక నూనెతో తయారైన పదార్థాలను తగ్గించి సమతుల ఆహారం తీసుకోవాలని, తగినంత నిద్రపోవాలని, ఫోన్లు వాడకం తగ్గించాలని, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. మద్యం, పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని చెప్పారు.

చిన్నారులకు కూల్‌డ్రింక్స్‌పై నియంత్రణ అవసరం

చిన్నపిల్లలకు తరచుగా కూల్‌డ్రింక్స్ ఇవ్వడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా చక్కెర అధికంగా ఉండే పానీయాల వినియోగాన్ని తగ్గించాలని తల్లిదండ్రులకు సూచించారు. గుండె జబ్బులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని డాక్టర్ గిరిధర్ హరి ప్రసాద్ పేర్కొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

టిబెటన్ బౌద్ధుల ఆధ్యాత్మిక గురువైన 14వ దలైలామా టెన్జిన్ గ్యాట్సో వారసుణ్ణి ఎవరు నిర్ణయించాలన్న ప్రశ్న, ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చించబడుతోంది. నవంబర్ 13న వాషింగ్టన్‌లో టిబెట్ ప్రవాస ప్రభుత్వానికి ఎన్నికైన రాజకీయ నాయకుడు పెన్పా త్సెరింగ్ చేసిన వ్యాఖ్యలు ఈ వివాదాన్ని మరోసారి తెరపైకి తెచ్చాయి. తదుపరి దలైలామా పునర్జన్మను గుర్తించే ప్రక్రియను తన నియంత్రణలోకి తెచ్చుకోవడం ద్వారా, టిబెట్ రాజకీయాలపై మరింత పట్టు సాధించేందుకు చైనా ప్రయత్నిస్తోందని ఆయన ఘాటుగా ఆరోపించారు. పెన్పా త్సెరింగ్, దలైలామా ఆధ్యాత్మిక నాయకత్వాన్ని గౌరవించే ప్రవాస పరిపాలనా వ్యవస్థకు నేతృత్వం వహిస్తున్నారు.



దలైలామా వారసత్వం

మతవిశ్వాసంపై నాస్తిక ప్రభుత్వ పెత్తనం

1642లో ఐదవ దలైలామా ఆధ్యాత్మిక నాయకత్వంతోపాటు టిబెట్ రాజకీయ, పరిపాలనా అధికారాన్ని కూడా చేపట్టినప్పటి నుంచి, దలైలామా సంస్థ టిబెట్ రాజకీయ చరిత్రలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. 1950లో ప్రస్తుత 14వ దలైలామా కూడా ఈ రెండు బాధ్యతలను స్వీకరించారు. టిబెటన్లు ఆరాధించే ఆయన వారసుడిగా తనకు అనుకూలమైన వ్యక్తిని గుర్తించడం ద్వారా వారి మతవిశ్వాసాలను, రాజకీయ విధేయతను తనవైపు తిప్పుకోవడం చైనా వ్యూహమని పెన్పా త్సెరింగ్ ఆరోపిస్తున్నారు.

పునర్జన్మను గుర్తించే సంప్రదాయం

టిబెటన్ బౌద్ధ సంప్రదాయంలో దలైలామాను కరుణకు ప్రతీకగా భావించే అవలోకితేశ్వర బోధిసత్వుని అవతారంగా విశ్వసిస్తారు. ఒక దలైలామా మరణించిన తరువాత విస్తారమైన సంప్రదాయ పద్ధతుల ద్వారా ఆయన పునర్జన్మను అన్వేషించి గుర్తించే ప్రక్రియను లామాలుగా పిలిచే బౌద్ధ మతగురువులు, మఠాధిపతులు నిర్వహిస్తారు. అలా గుర్తించిన బాలుడికి బౌద్ధ తత్వశాస్త్రం, ఆధ్యాత్మిక బాధ్యతలపై శిక్షణ ఇస్తారు. 1935లో జన్మించిన టెన్జిన్ గ్యాట్సోను రెండేళ్ల పసిప్రాయంలోనే 13వ దలైలామా పునర్జన్మగా గుర్తించారు. 1950లో చైనా సైనిక దళాలు టిబెట్‌లోకి ప్రవేశించిన నేపథ్యంలో, అప్పటికి 15 ఏళ్ల వయసున్న దలైలామా రాజకీయ అధికార బాధ్యతలను కూడా స్వీకరించారు. 1959 మార్చిలో చైనా సైనిక చర్యలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చెలరేగి పరిస్థితులు విషమించడంతో ఆయన రాజధాని లాసా నుంచి తప్పించుకున్నారు. భారత సరిహద్దులోకి ప్రవేశించిన ఆయనకు నెహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వం ఆశ్రయం కల్పించింది. 1960 నుంచి హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల ఆయన నివాస కేంద్రంగా, టిబెట్ ప్రవాస పరిపాలనా వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది.

టిబెట్‌లో దలైలామాలు ఆధ్యాత్మిక నాయకత్వంతోపాటు రాజకీయ అధికారాన్ని కూడా నిర్వహించే ద్వంద్వ నాయకత్వ సంప్రదాయానికి 2011లో ముగింపు పలుకుతూ.. దలైలామా తన రాజకీయ, పరిపాలనా అధికారాలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన టిబెట్ ప్రవాస నాయకత్వానికి అధికారికంగా బదిలీ చేశారు. 2025 జూలై 2న చేసిన ప్రకటనలో తన తరువాత కూడా దలైలామా సంస్థ కొనసాగుతుందని, తదుపరి పునర్జన్మను గుర్తించే అధికారం ధర్మశాలలో నమోదైన గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టుకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఇతర ప్రభుత్వాలకు లేదా సంస్థలకు ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని ఆయన ప్రకటించారు.

చైనా వాదన -- చారిత్రక నేపథ్యం

1792లో చైనాను పాలించిన క్వింగ్ చక్రవర్తి కియాన్‌లాంగ్ టిబెట్‌లోని కొన్ని ఉన్నత బౌద్ధ మతాధికారుల పునర్జన్మలను గుర్తించేందుకు అభ్యర్థుల పేర్లను స్వర్ణ పాత్రలో వేసి, వాటిలో ఒక చీటీని తీసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ విధానాన్ని కొనసాగించాలన్నదే చైనా వాదన. అయితే దలైలామా స్వయంగా వెల్లడించిన చారిత్రక వివరాల ప్రకారం, దలైలామాల ఎంపికలో ఈ విధానాన్ని వాస్తవంగా ఒక్కసారి మాత్రమే ఉపయోగించారు. అందువల్ల దీనిని ప్రతి వారసుడి ఎంపికలోనూ అమలైన నిరంతర సంప్రదాయంగా పరిగణించలేమని టిబెటన్ నాయకత్వం వాదిస్తోంది.

దానికి తోడు చైనా 2007లో జారీ చేసిన నిబంధనల ప్రకారం, టిబెటన్ బౌద్ధమతంలో పునర్జన్మ పొందే ఉన్నత మతాధికారుల గుర్తింపునకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. చారిత్రకంగా స్వర్ణ పాత్ర పద్ధతిని అనుసరించినవారి విషయంలోనూ దానిని పాటించాలి. అంటే, మత సంప్రదాయం ప్రకారం వారసుడిని గుర్తించినా, చైనా ప్రభుత్వ ఆమోదం లేకుండా ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టలేని పరిస్థితిని ఈ నిబంధనలు కల్పిస్తున్నాయి.

నాస్తిక భావజాలం - మతంపై పెత్తనం

చైనా కమ్యూనిస్టు పార్టీ మార్క్సిజం-లెనినిజం ఆధారిత నాస్తిక భావజాలాన్ని అనుసరిస్తుంది. బౌద్ధమతం విశ్వసించే పునర్జన్మ సిద్ధాంతాన్ని ససేమిరా అంగీకరించని ఆ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం, అదే సిద్ధాంతం ప్రకారం తదుపరి ఆధ్యాత్మిక నాయకుడిగా ఎవరిని గుర్తించాలో నిర్ణయించే అధికారం తనకుందని వాదిస్తోంది. ఈ వైఖరిని అమెరికా అంతర్జాతీయ మతస్వేచ్ఛా కమిషన్ మతస్వేచ్ఛకు విరుద్ధమైన ప్రభుత్వ జోక్యంగా విమర్శిస్తోంది.

రాజకీయ అధిపతులే మత వ్యవహారాల్లోనూ అంతిమ నిర్ణయాధికారాన్ని చెలాయించే ధోరణిని ప్రపంచ రాజకీయ చరిత్రలో 'సీజరోపాపిజం' అంటారు. బైజాంటైన్ సామ్రాజ్యంలో చక్రవర్తులు క్రైస్తవ చర్చి వ్యవహారాలపై చూపిన ఆధిపత్యం ఇందుకు ఉదాహరణ. మత విశ్వాసాలు భిన్నమైనా, చైనా వ్యవహారం ఈ చారిత్రక ధోరణిని గుర్తు చేస్తోంది.

పంచెన్ లామా ఉదంతం పునరావృతం అవుతుందా?

టిబెటన్ బౌద్ధమతంలోని గెలుగ్ సంప్రదాయంలో పంచెన్ లామాను దలైలామా తరువాత అత్యంత ముఖ్యమైన ఆధ్యాత్మిక నాయకుడిగా పరిగణిస్తారు. పునర్జన్మలను గుర్తించడంలో దలైలామా, పంచెన్ లామాలు పరస్పరం కీలక పాత్ర పోషిస్తారు.

1995లో 10వ పంచెన్ లామా మరణానంతరం, ఆధ్యాత్మిక అన్వేషణ ప్రక్రియ ద్వారా ఆరేళ్ల గెడున్ చోక్యి న్యిమాను 11వ పంచెన్ లామాగా దలైలామా గుర్తించారు. అయితే ఆ బాలుడు, అతని కుటుంబం కొద్దికాలంలోనే చైనా అధికారుల అదుపులోకి వెళ్లిన తరువాత అదృశ్యమైపోయారు. ఆ తరువాత చైనా ప్రభుత్వం గ్యాల్ట్సెన్ నోర్బును 11వ పంచెన్ లామాగా గుర్తించి ఆ పదవిలో ప్రతిష్ఠించింది. దీంతో దలైలామా గుర్తించిన వ్యక్తిని టిబెటన్ బౌద్ధ నాయకత్వం తమ పంచెన్ లామాగా పరిగణిస్తుండగా, చైనా గుర్తించిన వ్యక్తి అక్కడి అధికారిక మత వ్యవస్థలో కొనసాగుతున్నారు. ఈ ఉదంతం పునరావృతమై, తదుపరి దలైలామా ఎంపికలోనూ ఒకవైపు గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు, టిబెటన్ బౌద్ధ మతాధికారులు గుర్తించిన వారసుడు, మరోవైపు చైనా ప్రభుత్వం ఆమోదించిన వ్యక్తి తెరపైకి వస్తే, ఆ పరిణామం ప్రపంచవ్యాప్తంగా ఉన్న టిబెటన్ బౌద్ధులలో గందరగోళానికి దారితీస్తుందని టిబెటన్ ప్రవాస ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

భారత్‌కు ఉన్న చారిత్రక సంబంధం

బౌద్ధమతం పుట్టి, పరిఢవిల్లిన నేల భారత్. నలంద, విక్రమశిల వంటి ప్రాచీన విద్యాకేంద్రాలు, శాంతరక్షితుడు వంటి భారతీయ బౌద్ధాచార్యులు టిబెటన్ బౌద్ధ తాత్విక సంప్రదాయాల రూపకల్పనలో విశేష పాత్ర పోషించారు. 1959లో దలైలామా భారత్‌కు వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం ఆయనకు, ఆయనతో వచ్చిన వారికి ఆశ్రయం కల్పించడమే కాకుండా, కర్ణాటకలోని బైలకుప్పె, ముండ్‌గోడ్ వంటి ప్రాంతాల్లో టిబెటన్ శరణార్థుల స్థిరనివాసాల ఏర్పాటుకు, వారి పిల్లల విద్యాభ్యాసానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ధర్మశాలలో టిబెట్ ప్రవాస పరిపాలనా వ్యవస్థ ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇటువంటి 45 స్థిరనివాసాల్లో, వాటికి వెలుపలా లక్షకు పైగా టిబెటన్ శరణార్థులు నివసిస్తున్నారు. కూర్గ్ (కొడగు) పర్యటనకు వెళ్ళే తెలుగు పర్యాటకులకు బైలకుప్పె పరిచయమైన ప్రదేశమే. ప్రాకృతిక సౌందర్యంతో అలరారే ఈ టిబెటన్ స్థిరనివాసం, అక్కడి ప్రసిద్ధ గోల్డెన్ టెంపుల్ సందర్శకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది.

ఈ చారిత్రక, సాంస్కృతిక సంబంధాల దృష్ట్యా దలైలామా వారసత్వంపై జరుగుతున్న వివాదం భారత్‌కూ ఆందోళన కలిగించే పరిణామం. తదుపరి దలైలామా ఎంపిక భవిష్యత్తులో టిబెట్ రాజకీయాలనే కాకుండా, రక్షణ, వాణిజ్యపరంగా వ్యూహాత్మకమైన హిమాలయ ప్రాంతంలో భారత్-చైనా సంబంధాలనూ ప్రభావితం చేయగలదు.

మతవిశ్వాసం -- ప్రభుత్వ అధికార పరిధి

ఒక దేశ ప్రభుత్వం తన భూభాగంలోని మత సంస్థల ఆర్థిక, పరిపాలనా వ్యవహారాలను చట్టబద్ధంగా నియంత్రించవచ్చు. కానీ ఒక మతం విశ్వసించే పునర్జన్మ ప్రక్రియలో తదుపరి ఆధ్యాత్మిక నాయకుడు ఎవరన్నది ప్రభుత్వమే నిర్ణయించాలనుకోవడం మతపరమైన స్వతంత్రతకు సంబంధించిన ప్రశ్నను లేవనెత్తుతోంది. ఇదే టిబెటన్ బౌద్ధ నాయకత్వం అభ్యంతరం. బౌద్ధమతాన్ని విశ్వసించని నాస్తిక భావజాలాన్ని అనుసరించే కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం, అదే మతవిశ్వాసాలను ఆసరాగా తీసుకుని తనకు అనుకూలమైన వారసుడిని గుర్తించే ప్రయత్నాన్ని ప్రశ్నించడం సహేతుకంగానే కనబడుతోంది.

భారత్ తన బౌద్ధ వారసత్వాన్ని, టిబెట్‌తో ఉన్న చారిత్రక సంబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పరిణామాలను గమనించాల్సి ఉంది. దలైలామా వారసుడిని గుర్తించే విషయంలో టిబెటన్ బౌద్ధ సంప్రదాయానికి ఉన్న స్వతంత్రతను సమర్థించడం ద్వారా, భారత్ టిబెట్ తో ఉన్న తన చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలను పరిరక్షించుకోగలుగుతుంది.

కృష్ణ బాలాజి పల్లపోతు
చారిత్రక పరిశోధకులు
99490 98406

GHMC
GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
hmda
Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035

Mob : 9393929595



నాగార్జున 'కింగ్ 100'లో టబు పవర్‌ఫుల్ పాత్ర..

ఈసారి ప్రేమ కాదు, ఇద్దరి మధ్య భీకర పోరు! టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ సినిమా 'కింగ్ 100'తో బిజీగా ఉన్నారు. తన సినీ ప్రయాణంలో ఎన్నో విభిన్న పాత్రలు పోషించిన నాగ్.. ఈ ప్రత్యేక చిత్రంతో ప్రేక్షకులకు మరో కొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో ప్రముఖ నటి టబు కూడా కీలక పాత్రలో నటిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజాగా ఆమె పాత్రకు సంబంధించిన వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. కాగా, నాగార్జున, టబు కాంబోకి ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన సినిమాలు, ముఖ్యంగా వారి మధ్య కనిపించిన తెరపై కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే నాగార్జున సినిమాలో టబు నటించి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తోంది. ఇన్నాళ్ల తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే ఈసారి వీరిద్దరి మధ్య గతంలో మాదిరిగా రొమాంటిక్ సన్నివేశాలు కాకుండా, బలమైన సంఘర్షణ ఉండబోతున్నట్లు పాత్రల పరిచయం చూస్తే అర్థమవుతోంది. కథలో టబు పాత్రకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు కార్తీక్ ఈ సినిమాలో టబును 'మహంతి ఝాన్సీ రాణి' అనే శక్తిమంతమైన పాత్రలో చూపించారు. ఆమె పాత్రను పరిచయం చేస్తూ విడుదల చేసిన వీడియోలోనే అదిరిపోయే ఎలివేషన్లు కనిపించాయి. కష్టపడే మనుషులు, అదృష్టాన్ని నమ్ముకునే మనుషులు అంటూ రెండు రకాల వ్యక్తులు ఉంటారని, అయితే తాను మాత్రం అదృష్టాన్ని నమ్మనని టబు చెప్పే సంభాషణ పాత్రలోని ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తోంది.



'కాకా' బిజినెస్‌లో మెగాస్టార్ రేంజ్..

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ వినోదాత్మక చిత్రం 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం సినిమా చిత్రీకరణతో పాటు ఇతర నిర్మాణ పనులు కొనసాగుతుండగా, మరోవైపు విడుదలకు ముందే వ్యాపార లావాదేవీలపై చిత్రబృందం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. 'కాకా' సినిమాకు సంబంధించి న బిజినెస్ చర్చలు ఇప్పుడు టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కుల కోసం నిర్మాతలు ఏకంగా రూ.70 కోట్లు కోట్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సినిమాపై ఉన్న అంచనాలు, చిరంజీవి క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ధరను నిర్ణయించినట్లు తెలుస్తోంది.అంతేకాకుండా, ఈ మొత్తం కంటే తక్కువకు హక్కులను విక్రయించేందుకు నిర్మాతలు సిద్ధంగా లేరనే ప్రచారం కూడా సాగుతోంది. మరి ఈ భారీ మొత్తాన్ని చెల్లించి తెలుగు రాష్ట్రాల హక్కులను దక్కించుకునేందుకు ఏ పంపిణీ సంస్థ ముందుకు వస్తుందో చూడాలి. ఈ చిత్రంలో చిరంజీవి కథిరి కాళిదాస్ అనే పాత్రలో కనిపించనున్నారు. మలయాళ నటి అనస్వర రాజన్ ఆయన కుమార్తె అమ్ములుగా నటిస్తోంది. నివేదా పేతురాజ్ మరో కీలక పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ అధికారిగా నటిస్తున్నారు. కబీర్ దుహాన్ సింగ్ అండర్‌కవర్ ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు సునీల్, గెటప్ శ్రీను తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాతో కేవీఎన్ ప్రొడక్షన్స్ తొలిసారి తెలుగు చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. చిరంజీవి, బాబీ కొల్లి కలయికలో వస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

ఆ తరహా పాత్రలు చేసే సత్తా మాలో ఉంది



స్త్రీవాదాన్ని బలంగా వినిపించే బాలీవుడ్ కథానాయికల్లో కృతి సనన్ ముందు వరుసలో ఉంటుంది. సినీ పరిశ్రమలో స్త్రీలపై వివక్ష అనే అంశంపై ఆమె పలుమార్లు స్పందించారు కూడా. తాజాగా ప్రేక్షకులను థియేటర్లకు తెచ్చే సత్తా హీరోయిన్లకు కూడా ఉందని, కేవలం అగ్ర హీరోలతో మాత్రమే అధిక బడ్జెట్‌లు పెట్టి సినిమాలు తీసే సంస్కృతి నుంచి మేకర్స్ బయటకు రావాలని కృతి సనన్ అన్నారు.ఇటీవల ఓ ప్రైవేటు వేడుకలో ఆమె మాట్లాడుతూ 'పఠాన్, ధురంధర్ లాంటి భారీ బడ్జెట్ యాక్షన్ సినిమాలను మహిళా ప్రధాన పాత్రలతో తెరకెక్కించినా జనం ఆదరిస్తారు. అలాంటి పాత్రల్ని చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. తీయడానికి నిర్మాతలకు ధైర్యం ఉందా?' అని కృతి సనన్ ప్రశ్నించారు. నిర్మాతలు ధైర్యం చేసి, తమ లాంటి హీరోయిన్లతో భారీ కమర్షియల్ సినిమాలు నిర్మించగలిగితే.. వాటిని తమ భుజస్కంధాలపై విజయవంతంగా మోయగలిగే శక్తి తమకుందని కృతి సనన్ చెప్పారు. కృతి సనన్ మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి.

ఆయుష్మాన్ ఖురానాకు బెదిరింపు కాల్స్.. కోట్లు డిమాండ్ చేసిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్.?



బాలీవుడ్ ప్రముఖ నటుడు ఆయుష్మాన్ ఖురానాకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో కోట్లాది రూపాయలు డిమాండ్ చేస్తూ ఒక బెదిరింపు ఆడియో సందేశం రావడం కలకలం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించి అజ్ఞాత వ్యక్తి నుంచి వాయిస్ మెసేజ్ రూపంలో బెదిరింపు కాల్ రాగా, తాము లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులమని చెబుతూ వారు భారీగా డబ్బులు డిమాండ్ చేశారు. ఈ ఆడియో క్లిప్‌ను అందుకున్న ముంబై పోలీసులు దీనిపై తీవ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. కాలర్ నిజంగానే ఆ గ్యాంగ్‌కు చెందినవాడా లేక ఎవరైనా గ్యాంగ్ పేరు వాడుకుని భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నారా అనే కోణంలో ఆడియో రికార్డులను ఇప్పటికే ఉన్న పోలీసు రికార్డులతో పోల్చి పరిశీలిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం నటుడు తుషార్ కపూర్, అలాగే మరికొంత మంది ప్రముఖులకు కూడా ఇలాంటి బెదిరింపు కాల్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటన మరియు వరుస బెదిరింపుల నేపథ్యంలో బాలీవుడ్ ప్రముఖుల భద్రతపై ముంబై పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం ఈ ఆడియో క్లిప్‌నకు సంబంధించి ప్రాథమిక విచారణ జరుగుతుండగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అలా నమితను కాస్తా మమితనయ్యా



'ప్రేమలు' సినిమా మమితాబైజు తలరాతను మార్చింది. ఆ సినిమాలోని ఆమె నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆ ఒక్కసినిమాతోనే దక్షిణభారతం మొత్తం మమితకు ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఆ తర్వాత వచ్చిన డ్యూడ్, జననాయగన్, విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలు ఆమెను ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. ప్రస్తుతం తమిళంలో 'ఇరందు వానమ్', మలయాళంలో 'హలో డియర్' సినిమాలు చేస్తూ మమిత బిజీగా ఉన్నది. ఇదిలావుంటే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన పేరుకు సంబంధించిన ఓ రహస్యాన్ని బయటపెట్టింది మమితా బైజు. నిజానికి ఆమె పుట్టగానే తల్లిదండ్రులు పెట్టిన పేరు నమిత. అయితే.. బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే క్రమంలో అధికారుల పొరపాటు కారణంగా 'నమిత' అనే పేరు కాస్తా.. 'మమిత'గా మారిపోయిందట. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ 'ఈ విషయం అమ్మానాన్నలకు కూడా వెంటనే తెలియలేదు. నాలుగేళ్ల వయసులో నన్ను స్కూల్‌లో చేర్పించడానికి నా బర్త్ సర్టిఫికెట్‌ని పరిశీలించగా ఈ తప్పు బయటపడింది. అప్పటికే అఫీషియల్ డాక్యుమెంట్స్ అన్నింటిలో మమితా అనే పేరే నమోదైపోవడంతో దాన్ని మార్చడం సాధ్యం కాలేదు. అలా నమితను కాస్తా మమితను అయ్యాను' అంటూ చెప్పుకొచ్చింది మమితాబైజు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.